www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH I TELUGU I HINDI DAILY

సోమవారం, 15-06-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :46 Issue : 46 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in



ఫ్రాన్స్ ....
జీ7 శిఖరాగ్ర సమావేశంలో భాగంగా ఫ్రాన్స్‌లోని నీస్ నగరానికి చేరుకున్న మోదీకి భారతీయ ప్రవాసులు స్వాగతం పలికారు...
ఈ సమయంలో ఓ చిన్నారిని మోదీ ఎత్తుకుని ఆడించారు....

## 400 కోట్ల దిశగా దూసుకెళ్తున్న పెద్ది

8



# రేవంత్ ప్రభుత్వానికి ఇంటర్వెల్ పడిపోయింది



- సొంత పార్టీ నేతలనే మోసం చేసిన సీఎం
- అవినీతిపై రాహుల్‌కు నివేదిక ఇచ్చిన మీనాక్షిపై పగ
- ఖైరతాబాద్ సమావేశంలో కేటీఆర్ విమర్శలు

**హైదరాబాద్, జూన్ 14, ఆశ్వి అప్డేట్స్:**
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని వ్యాఖ్యానించారు. ఖైరతాబాద్ నియోజకవర్గ కార్యకర్తల

మిగతా 3వ పేజీలో..

## పాలమూరులో కాంగ్రెస్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారు

3

# ఏఐ సాయంతో కాంగ్రెస్ మద్దతుదారుల గుర్తింపు

- ప్రజాస్వామ్యానికి ముప్పుగా కేంద్ర విధానాలు
- ఎస్ఐఆర్ పేరుతో విపక్షాల ఓట్లకు ఎసరు
- డిప్యూటీ సీఎం భట్టి సంచలన ఆరోపణలు

**హైదరాబాద్, జూన్ 14, ఆశ్వి అప్డేట్స్:**
ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను అడ్డం పెట్టుకుని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విపక్షాలకు చెందిన ఓటర్ల పేర్లను పెద్దఎత్తున తొలగిస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆరోపించారు. రాజకీయ ప్రయోజనాల కోసమే దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియను అమలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. ప్రత్యేక నిఘా, సవరణ (ఎస్ఐఆర్) పేరుతో అసలైన ఓటర్ల

మిగతా 2వ పేజీలో..



## చరిత్రను, భవిష్యత్తును గుండెలకు హత్తుకున్న హైదరాబాద్

2




# అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి

- వర్షాలపై అలసత్వం వద్దు కఠిన చర్యలు తప్పవు
- ట్రాఫిక్ జామ్‌లు, వాటర్ లాగింగ్‌పై సీఎం ఆగ్రహం
- వర్షాకాల సన్నద్ధతపై ఉన్నతాధికారులతో సమీక్ష

**హైదరాబాద్, జూన్ 14, ఆశ్వి అప్డేట్స్:**
వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. అలసత్వంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వర్షాల సమయంలో ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో వర్షాకాల సన్నద్ధతపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ

మిగతా 3వ పేజీలో..

# ధాన్యం సేకరణలో తెలంగాణ రికార్డు



- భారతదేశపు అన్నపూర్ణ మన తెలంగాణ
- 150 లక్షల టన్నుల వరి కొనుగోలు
- రైతులకు రూ.35,537 కోట్ల చెల్లింపులు
- 48–72 గంటల్లోనే డబ్బుల జమ

**హైదరాబాద్, జూన్ 14, ఆశ్వి అప్డేట్స్:**
వ్యవసాయ రంగంలో తెలంగాణ మరోసారి దేశానికి ఆదర్శంగా నిలిచింది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రికార్డు స్థాయిలో 150 లక్షల టన్నుల వరిని సేకరించి 'భారతదేశపు అన్నపూర్ణ'గా తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన పటిష్టమైన చర్యలు ధాన్యం సేకరణలో చారిత్రాత్మక ఫలితాలను అందించాయి.
ఈ సీజన్‌లో 26.43 లక్షల మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి గాను రూ.35,537 కోట్లను ప్రభుత్వం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ

మిగతా 3వ పేజీలో..



## దమ్ముంటే అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలకు రండి

- ముఖ్యమంత్రి పదవికి మేం ఇస్తున్న గౌరవాన్ని, చేతకానితనంగా భావించొద్దు
- సీఎం రేవంత్‌కు ఎంపీ రఘునందన్ రావు సవాల్

2



## మా మంత్రులు, ఎంపీలే అన్ని చేస్తే.. సీఎం ఎందుకు?

- తెలంగాణలో ఏ వర్గం సంతృప్తిగా లేదు
- హామీలు అమలు చేయలేక అబద్ధాలు చెబుతున్నారు
- రేవంత్ వద్ద ఇన్ని శాఖలు ఎందుకో చెప్పాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాం చందర్ రావు విమర్శలు

2

## కనగల్‌లో సీఎం సభకు భారీ ఏర్పాట్లు

- రాష్ట్రవ్యాప్తంగా డబుల్ రోడ్లకు శంకుస్థాపన
- హ్యాం రోడ్లు, ఎస్ఎల్బీసీ పనులు 2028 నాటికి పూర్తి చేస్తాం: కోమటిరెడ్డి

3



## ప్రభుత్వ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి కిట్లు

- బూట్లు, బ్యాగులు, టైలు, బెల్టులతో పూర్తి సామగ్రి
- 27 లక్షల మంది విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు

**హైదరాబాద్, జూన్ 14, ఆశ్వి అప్డేట్స్:**
ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరంలో కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని స్థాయిలో నాణ్యమైన కిట్లను

మిగతా 2వ పేజీలో..






## అధికారం కోసం కాదు.. చైతన్యం కోసమే మా పోరాటం


2

- యువతే దేశ భవిష్యత్తును మార్చాలి
- పేపర్ లీకులు, పరీక్షల రద్దుకు ముగింపు పలకాలి
- సామాజిక ఉద్యమకారుడు సోనామ్ వాంగ్‌చుక్

## తెలంగాణ పర్యాటక రంగానికి కొత్త ఊపు

- పర్యాటకం, సంస్కృతి, వారసత్వ రంగాల్లో పురోగతి
- రూ.15 వేల కోట్ల పెట్టుబడులు..
- 3 లక్షల ఉద్యోగాల లక్ష్యం
- ప్రపంచస్థాయి పర్యాటక గమ్యస్థానంగా తెలంగాణ

3





## ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది

- కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతున్నాం
- ప్రజలు మళ్లీ బీఆర్ఎస్ పాలన కోరుకుంటున్నారు: హరీష్ రావు

**హనుమకొండ, జూన్ 15, ఆశ్వి అప్డేట్స్:**
కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, ప్రజావ్యతిరేక విధానాలు, అవినీతి, అరాచకాలపై ప్రధాన

మిగతా 2వ పేజీలో..

## మాదాపూర్‌లో డ్రగ్స్ పార్టీ భగ్నం

- వీకెండ్ పార్టీపై ఎస్‌వోటీ దాడులు.. 9 మంది అదుపులో
- విజయవాడ నుంచి డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముఠా గుట్టురట్టు
- ఎండీఎంఏ, గంజాయి స్వాధీనం.. ఇద్దరు పరారీలో

2



# ఏఐ సాయంతో కాంగ్రెస్ మద్దతుదారుల గుర్తింపు

**మొదటిపేజీ తరువాయి**

హక్కులను కాలరాస్తున్నారని భట్టి అన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చే ఓటర్లను లక్ష్యంగా చేసుకుని, వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగిస్తున్నారని ఆరోపించారు. క్షేత్రస్థాయిలో సరైన ధృవీకరణ లేకుండానే విపక్షాల ఓట్లను తొలగించే చర్యలు కొనసాగుతున్నాయని మండిపడ్డారు. ఈ వ్యవహారంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారని భట్టి ఆరోపించారు. సోషల్ మీడియా పోస్టులు, డిజిటల్ కార్యకలాపాలను విశ్లేషించి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపే ఓటర్లను కృత్రిమ మేధ సాయంతో గుర్తిస్తున్నారని తెలిపారు. అలా గుర్తించిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం లేదా నిలిపివేయడం జరుగుతోందని విమర్శించారు. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు కేవలం ఓటు హక్కును హరించడం మాత్రమే కాదని భట్టి పేర్కొన్నారు. ప్రభుత్వ రికార్డుల నుంచి ఒక వ్యక్తి పేరును అన్యాయంగా తొలగించడం వల్ల భవిష్యత్తులో వారి పౌరసత్వ హక్కులపైనా ప్రభావం పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇది అత్యంత ప్రమాదకరమైన పరిణామమని వ్యాఖ్యానించారు. ఈ అంశం ఒక రాష్ట్రానికే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ఇటువంటి చర్యలకు పాల్పడుతోందని భట్టి ఆరోపించారు. ఎన్నికల్లో అక్రమ రాజకీయ లబ్ధి పొందడానికే ప్రజల తీర్పును ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని మండిపడ్డారు. ప్రజాస్వామ్యవాదులు, పౌరసమాజం, రాజకీయ పార్టీలు ఈ పరిణామాలపై అప్రమత్తంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.

# చరిత్రను, భవిష్యత్తును గుండెలకు హత్తుకున్న హైదరాబాద్

- నగర ఆత్మ సలార్ జంగ్ మ్యూజియం
- మత సామరస్యానికి సజీవ సాక్ష్యంగా నిలిచిన వారసత్వ సంపద
- పర్యాటకాభివృద్ధితో వేల మందికి ఉపాధి కల్పిస్తాం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**హైదరాబాద్, జూన్ 14, ఆశ్వి అప్డేట్స్:**
సలార్ జంగ్ మ్యూజియం హైదరాబాద్ నగర ఆత్మకు ప్రతిరూపమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. కొన్ని సంస్థలను నగరాలు నిర్మిస్తే, మరికొన్ని సంస్థలు ఆ నగర ఆత్మను నిర్మిస్తాయని పేర్కొన్నారు. సలార్ జంగ్ మ్యూజియం 75వ వార్షికోత్సవాలు, మీర్ యూసుఫ్ అలీఖాన్ (సలార్ జంగ్3) 137వ జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు.
ప్రపంచ నాగరికతలను భద్రపరిచిన మహోన్నత వ్యక్తి సలార్ జంగ్3 అని భట్టి కొనియాడారు. 43 వేలకుపైగా కళాఖండాలను సేకరించడం సాధారణ విషయం కాదని, అది కళలపై ఆయనకున్న అపారమైన అభిరుచి, అంకితభావానికి నిదర్శనమని అన్నారు. ప్రపంచ చరిత్రను, సౌందర్యాన్ని తన సొంత సంపదతో సేకరించి ప్రజల ఆస్తిగా మార్చిన మహనీయుడని పేర్కొన్నారు.
ఈ మ్యూజియంలో హిందూ, ముస్లిం, క్రైస్తవ, బౌద్ధ సంప్రదాయాలకు చెందిన అరుదైన కళాఖండాలు ఒకే చోట ఉన్నాయని భట్టి తెలిపారు. విష్ణుమూర్తి దశావతారాలు, ఖురాన్ శ్లోకాలతో కూడిన కళావస్తువులు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని చెప్పారు. ఇది కేవలం లౌకికవాదంపై ప్రసంగం కాదని, లౌకికత్వానికి సజీవ సాక్ష్యమని వ్యాఖ్యానించారు.
మ్యూజియం పక్కనే ప్రవహించే మూసి నది హైదరాబాద్ జ్ఞాపకాల ప్రవాహమని భట్టి పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురైన మూసిని ప్రక్షాళన చేసి అంతర్జాతీయ స్థాయి రివర్‌ఫ్రంట్‌గా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. లండన్ థేమ్స్, పారిస్ సీన్ నదుల తరహాలో మూసిని తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. సలార్ జంగ్ మ్యూజియంను అభివృద్ధి చెందిన మూసి రివర్‌ఫ్రంట్‌కు సాంస్కృతిక కిరీటంగా మార్చే ప్రణాళిక సిద్ధమవుతోందన్నారు. పర్యాటకులు నది గుండా ప్రయాణిస్తూ చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదను వీక్షించేలా ఏర్పాట్లు చేస్తామని చెప్పారు.
హైదరాబాద్ అంటే కేవలం చార్మినార్ మాత్రమే కాదని, సైబర్ టవర్స్ నగరం కూడా అని భట్టి పేర్కొన్నారు. ఐటీ, బయోటెక్నాలజీ, ఔషధ రంగాల్లో ప్రపంచస్థాయి గుర్తింపు సాధించిన నగరంగా హైదరాబాద్ ఎదిగిందన్నారు. చరిత్రను, భవిష్యత్తును సమానంగా గుండెలకు హత్తుకున్న నగరం హైదరాబాద్ అని వ్యాఖ్యానించారు. చార్మినార్, గోల్కొండ, కుతుబ్‌షాహీ సమాధులు, చౌమహల్లా ప్యాలెస్, ఫలక్‌నుమా ప్యాలెస్‌లతో కూడిన ఓల్డ్ సిటీ హెరిటేజ్ సర్క్యూట్‌ను సలార్ జంగ్ మ్యూజియంతో అనుసంధానిస్తామని తెలిపారు. నైట్ టూరిజం, బహుభాషా గైడెడ్ టూర్లను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు. వారసత్వ సంపద కేవలం గర్వపడటానికే కాదని, స్థానిక కళాకారులు, గైడ్‌లు, హోటళ్లు, రవాణా రంగాలకు ఉపాధి కల్పించే ఆర్థిక వనరుగా మారాలని భట్టి అన్నారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా వేలాది మందికి జీవనోపాధి అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థి సలార్ జంగ్ మ్యూజియాన్ని సందర్శించి 'ఇది నా ఆస్తి' అనే భావన పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాలలు, విశ్వవిద్యాలయాలతో భాగస్వామ్యం కుదుర్చుకుని విద్యార్థుల్లో చరిత్ర, సంస్కృతిపై అవగాహన పెంచుతామని తెలిపారు. ఐటీ, వ్యాపార అవసరాల కోసం హైదరాబాద్‌కు వచ్చే విదేశీ పెట్టుబడిదారులు కూడా నగర సంస్కృతిని ఆస్వాదించాలని భట్టి కోరారు. బిర్యానీ, హలీమ్, ఇరానీ చాయ్ వంటి సంప్రదాయాలు తెలంగాణ సాంస్కృతిక ఆర్థిక వ్యవస్థకు ప్రతీకలని అన్నారు. ఈ 75 ఏళ్లుగా మ్యూజియాన్ని సంరక్షిస్తూ వస్తున్న క్యూరేటర్లు, భద్రతా సిబ్బంది, పరిపాలనా ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. సలార్ జంగ్3 సేకరించిన అమూల్యమైన వారసత్వ సంపదను ఆధునీకరించి భావితరాలకు అందించడం ద్వారానే ఆయనకు నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని భట్టి విక్రమార్క అన్నారు.

# ప్రభుత్వ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి కిట్లు

**మొదటిపేజీ తరువాయి**

రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. యూనిఫాంలతో పాటు బూట్లు, సాక్సులు, స్కూల్ బ్యాగులు, టైలు, బెల్టులు, బెడ్డింగ్ సామగ్రి వంటి పలు వస్తువులను విద్యార్థులకు పంపిణీ చేయనుంది. విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాంలు అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. యూనిఫాం వస్త్రం కొనుగోలు నుంచి కుట్టు వరకు ప్రతి దశలో నాణ్యతకు పెద్దపీట వేయాలని సూచించారు. దీంతో ఈసారి పేరెన్నికగన్న సంస్థల నుంచి యూనిఫాం వస్త్రాన్ని సేకరిస్తున్నారు.
రాష్ట్రవ్యాప్తంగా సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫాంలు అందించేందుకు ప్రభుత్వం 2.97 కోట్ల మీటర్ల వస్త్రాన్ని కొనుగోలు చేస్తోంది. విద్యార్థుల కోసం యూనిఫాం రంగుల్లో కూడా మార్పులు చేసింది. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు లైట్ బ్లూ, డార్క్ బ్లూ రంగుల యూనిఫాంలు, గురుకుల విద్యార్థులకు మెరూన్ రంగు యూనిఫాంలు అందించనున్నారు. యూనిఫాం కుట్టు పనిని మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది యూనిఫాంల తయారీలో మహిళలు నిమగ్నమయ్యారు. ఈ ప్రక్రియ ద్వారా మహిళా సంఘాలకు రూ.40 కోట్లకు పైగా ఆదాయం లభించనుంది. ఈసారి ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తొలిసారిగా నల్లటి బూట్లు, బెల్టులు అందించనున్నారు.
గురుకులాలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ గురుకులాల విద్యార్థులకు బెల్టు, టై, ఐడీ కార్డు, స్కూల్ బ్యాగు, బూట్లు, సాక్సులు, బెడ్డింగ్ సామగ్రి, ప్లేటు, గ్లాసు, కటోరా, ట్రంక్ బాక్స్, పీటీ డ్రెస్, నైట్ డ్రెస్, ట్రాక్ సూట్‌తో కూడిన పూర్తి కిట్ అందించనున్నారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న సుమారు రెండు లక్షల మంది విద్యార్థులకు కూడా బ్యాగులు, బెల్టులు, టైలు, బూట్లు, సాక్సులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు ఇప్పటికే ఆయా పాఠశాలలకు చేరాయి. విద్యాసంవత్సరం ప్రారంభమైన తొలి వారంలోనే వాటి పంపిణీ పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టారు. విద్యార్థులకు నాణ్యమైన సామగ్రి అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మొత్తం రూ.687.78 కోట్లు వెచ్చిస్తోంది. దీనిని ఖర్చుగా కాకుండా భావితరాల భవిష్యత్తుపై పెట్టుబడిగా ప్రభుత్వం భావిస్తున్నట్లు అధికారులు తెలిపారు. యూనిఫాంలు, దుప్పట్లు, బెడ్‌షీట్లు, కార్పెట్ల తయారీ ఆర్డర్లలో భాగాన్ని తెలంగాణ చేనేత సహకార సంస్థకు అప్పగించగా, టైలు, బెల్టులు, ఐడీ కార్డుల తయారీ బాధ్యతలను తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పొరేషన్‌కు అప్పగించారు. దీంతో చేనేత కార్మికులు, వివిధ రంగాల కార్మికులకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. గతంలో ఉన్న అవకతవకలకు అడ్డుకట్ట వేయడానికి ఈసారి రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా కేంద్రీకృత కొనుగోలు విధానాన్ని అమలు చేస్తోంది. దీంతో అన్ని యాజమాన్యాల విద్యార్థులకు ఒకే ప్రమాణాలతో, ఒకే సమయంలో నాణ్యమైన యూనిఫాంలు, కిట్లు అందనున్నాయి.

# మాదాపూర్‌లో డ్రగ్స్ పార్టీ భగ్నం

**హైదరాబాద్, జూన్ 14, ఆశ్వి అప్డేట్స్:**
హైదరాబాద్ ఐటీ కారిడార్ పరిధిలోని మాదాపూర్‌లో నిర్వహిస్తున్న డ్రగ్స్ పార్టీని ఎస్‌వోటీ పోలీసులు భగ్నం చేశారు. నమ్మకమైన సమాచారంతో శనివారం అర్ధరాత్రి నిర్వహించిన దాడుల్లో పార్టీ నిర్వాహకుడితో పాటు మొత్తం తొమ్మిది మంది యువకులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, మాదాపూర్ పరిధిలోని చంద్రనాయక్ తండాలో ఉన్న ఎంబీఎస్ భాగ్యలక్ష్మి అపార్ట్‌మెంట్స్‌లోని ఓ ఫ్లాట్‌లో డ్రగ్స్ పార్టీ జరుగుతున్నట్లు సమాచారం అందింది. దీంతో ఎస్‌వోటీ బృందాలు ఆకస్మికంగా దాడులు నిర్వహించాయి. వీకెండ్ సందర్భంగా ప్రత్యేకంగా విజయవాడ నుంచి కొందరు యువకులు హైదరాబాద్‌కు వచ్చినట్లు పోలీసులు గుర్తించారు. దాడుల్లో పార్టీ నిర్వాహకుడిగా భావిస్తున్న దనేకుల తరుణ్ తేజతో పాటు మరో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మాదకద్రవ్యాలు, మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో విజయవాడకు చెందిన కార్తీక్, పృథ్వి అనే వ్యక్తులు ఈ డ్రగ్స్ నెట్‌వర్క్‌ను నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. వీరు దనేకుల తరుణ్ తేజ ద్వారా హైదరాబాద్‌లో యువతకు మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్నట్లు వెల్లడైంది. నిందితుల వద్ద నుంచి 15 గ్రాముల ఎండీఎంఏ, 382 గ్రాముల ఓజీ కుష్ గంజాయితో పాటు 9 మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న మాదకద్రవ్యాల విలువ లక్షల్లో ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రధాన నిర్వాహకుడు తరుణ్ తేజను అరెస్ట్ చేసిన పోలీసులు, పరారీలో ఉన్న కార్తీక్, పృథ్విల కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ ముఠాకు మరెవ్వరితో సంబంధాలు ఉన్నాయా, నగరంలో ఇంకెక్కడైనా డ్రగ్స్ సరఫరా చేస్తున్నారా అనే కోణంలో పోలీసులు లోతుగా విచారణ కొనసాగిస్తున్నారు.



# మా మంత్రులు, ఎంపీలే అన్ని చేస్తే.. సీఎం ఎందుకు?

**హైదరాబాద్, జూన్ 14, ఆశ్వి అప్డేట్స్:**
తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలను నిరాశపరిచిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాం చందర్ రావు విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. అంబర్‌పేట్ నియోజకవర్గంలో నిర్వహించిన బీజేపీ విస్తృత స్థాయి సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో కలిసి పాల్గొన్న ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు గుప్పించారు.
రాష్ట్రంలో ప్రస్తుతం ఏ వర్గం ప్రజలు కూడా సంతృప్తిగా లేరని రాం చందర్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీని అబద్ధాలకు తల్లిగా అభివర్ణించిన ఆయన, హామీలను అమలు చేయలేక ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో చెప్పిన మాటలకు, ప్రస్తుతం చేస్తున్న పనులకు ఎలాంటి పొంతన లేదన్నారు.
రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆ ఘనతను తమ ఖాతాలో వేసుకుని ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కోసం కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరుతున్నారని, అన్ని పనులు కేంద్ర మంత్రులు, ఎంపీలు చేస్తే ముఖ్యమంత్రి పదవిలో ఎందుకు కొనసాగుతున్నారని ప్రశ్నించారు.
హైదరాబాద్‌లో ఒక్కరోజు వర్షం పడితేనే నగరం అతలాకుతలమైందని రాం చందర్ రావు అన్నారు. దీనికి మున్సిపల్ శాఖ బాధ్యత వహించాల్సి ఉందని, ఆ శాఖను పర్యవేక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు.
ఫ్యూచర్ సిటీ ప్రాజెక్టుపై కూడా ఆయన విమర్శలు చేశారు. ఫ్యూచర్ సిటీలో రేవంత్ రెడ్డికి రాజకీయ భవిష్యత్తు లేదని వ్యాఖ్యానించారు. రాబోయే మూడు మున్సిపాలిటీల ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న సాన్నిహిత్యం ఇప్పుడు ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు.
బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు మధ్యవర్తిగా ఎంఐఎం వ్యవహరిస్తోందని రాం చందర్ రావు ఆరోపించారు. ఈ మూడు పార్టీలు కలిసి హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నాయని విమర్శించారు. ప్రజాసేవ కోసం కాకుండా కమిషన్ల కోసం ప్రభుత్వం పనిచేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి వద్ద అనేక శాఖలు, బాధ్యతలు ఎందుకు ఉన్నాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఏమి చేసిందనే అంశంపై సచివాలయం గేట్ ముందు బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి ముందుగా హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల అభివృద్ధిపై మాట్లాడాలని, ఆ తర్వాత ఫ్యూచర్ సిటీ గురించి మాట్లాడాలని సూచించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టకుండా ప్రచార రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు.

## దమ్ముంటే అసెంబ్లీ రద్దు చేసి ఎన్నికలకు రండి

**మెదక్, జూన్ 14, ఆశ్వి అప్డేట్స్:**
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తీవ్రస్థాయిలో స్పందించారు. రాష్ట్రంలోని ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు తమ పదవులకు రాజీనామా చేసేందుకు సిద్ధంగా ఉన్నారని ప్రకటించారు. ముఖ్యమంత్రి కూడా తన పదవికి రాజీనామా చేసి శాసనసభను రద్దు చేసి ఎన్నికలకు రావాలని సవాల్ విసిరారు. కాంగ్రెస్‌కు చెందిన ఎనిమిది మంది ఎంపీలను అలాగే ఉంచుకోవచ్చని, ప్రజాక్షేత్రంలో ఎవరికెంత బలం ఉందో ఎన్నికల్లో తేల్చుకుందామని అన్నారు. ముఖ్యమంత్రి పదవికి తాము ఇస్తున్న గౌరవాన్ని, తమ సంస్కారాన్ని చేతకానితనంగా భావించవద్దని హెచ్చరించారు. రాజకీయంగా తాము కూడా ధీటుగా సమాధానం చెప్పగలమని రఘునందన్ రావు స్పష్టం చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఇంటి ముందు వడ్లు పోస్తామని కాంగ్రెస్ నేతలు మాట్లాడటం సరికాదన్నారు. అలాంటి చర్యలు తమకు కూడా చేయడం వచ్చని, అవసరమైతే కొడంగల్‌లో గానీ, ప్రజా భవన్ ముందు గానీ వడ్లు పోయగలమని వ్యాఖ్యానించారు.
రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ సవాళ్లు, విమర్శల కంటే రైతుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వంపై, బీజేపీపై అనవసర ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవు పలికారు.
ప్రజల్లో తమకు మద్దతు ఉందనే నమ్మకం ఉంటే ముఖ్యమంత్రి వెంటనే అసెంబ్లీని రద్దు చేసి ఎన్నికలకు వెళ్లాలని రఘునందన్ రావు డిమాండ్ చేశారు. ప్రజలే అంతిమ న్యాయ నిర్ణేతలని, వారి తీర్పుతో ఎవరి బలం ఎంత ఉందో స్పష్టమవుతుందని అన్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, ధాన్యం కొనుగోలు, వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశాలపై ప్రభుత్వం దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాజకీయ వివాదాల కంటే ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాధాన్యత కావాలని రఘునందన్ రావు అన్నారు.

## ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుంది

**మొదటిపేజీ తరువాయి**

ప్రతిపక్షంగా బీఆర్ఎస్ సమర్థవంతంగా పోరాటం చేస్తోందని మాజీ మంత్రి, అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు అన్నారు.
హనుమకొండలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న తప్పుదోవ పట్టించే విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకువస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అవినీతి, వైఫల్యాలను బట్టబయలు చేస్తూ ప్రజల తరపున నిరంతరం పోరాడుతున్నామని చెప్పారు.
బీఆర్ఎస్ కార్యకర్తల అండదండలతోనే ఈ పోరాటం మరింత బలంగా కొనసాగుతోందని హరీష్ రావు పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడుతున్న ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని అన్నారు.
కేసీఆర్ పాలనలో అమలైన సంక్షేమ పథకాల వెనుక స్పష్టమైన విజన్ ఉందని హరీష్ రావు తెలిపారు. కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా బాల్య వివాహాలు గణనీయంగా తగ్గాయని చెప్పారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్ పథకాల వల్ల మాతాశిశు మరణాల రేటు తగ్గిందని పేర్కొన్నారు. ఎస్సీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల విద్యాభివృద్ధికి గురుకుల పాఠశాలలు ఎంతో దోహదపడ్డాయని తెలిపారు. బాల కార్మిక వ్యవస్థ తగ్గడంలో కూడా గురుకులాల పాత్ర కీలకమైందన్నారు.
మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ తాగునీరు అందించడంతో పాటు ఫ్లోరైడ్ సమస్యను అధిగమించామని చెప్పారు. మిషన్ కాకతీయ, చెక్‌డ్యాంలు, సాగునీటి ప్రాజెక్టులతో వ్యవసాయ రంగానికి బలమైన పునాది వేశామని పేర్కొన్నారు. రైతుల ఆత్మహత్యలు తగ్గడంలో ఈ పథకాలు కీలక పాత్ర పోషించాయని అన్నారు. హిందూ, ముస్లిం వర్గాలను కేసీఆర్ సమాన దృష్టితో చూసారని, అన్ని వర్గాల అభివృద్ధికి కృషి చేశారని హరీష్ రావు తెలిపారు. కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని, మళ్లీ బీఆర్ఎస్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు.
పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్యకర్తల కుటుంబాలకు అండగా నిలవడం తమ బాధ్యత అని చెప్పారు. భవిష్యత్తులో కూడా కార్యకర్తల సంక్షేమానికి సంబంధించిన కార్యక్రమాలను కొనసాగిస్తామని హరీష్ రావు స్పష్టం చేశారు.

## అధికారం కోసం కాదు.. చైతన్యం కోసమే మా పోరాటం

**హైదరాబాద్, జూన్ 14, ఆశ్వి అప్డేట్స్:**



హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వేదికగా ఆదివారం నిర్వహించిన వినూత్న నిరసన కార్యక్రమంలో ప్రముఖ సామాజిక, పర్యావరణ ఉద్యమకారుడు సోనామ్ వాంగ్‌చుక్ పాల్గొన్నారు. 'కాక్రోజ్ జనతా పార్టీ' ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువతను ఉద్దేశించి ఆయన ఉద్వేగభరితంగా ప్రసంగించారు. దేశ భవిష్యత్తును యువతే ముందుకు నడిపించాలని, తాను వంటి వారు వారికి మార్గనిర్దేశం చేస్తూ ఎల్లప్పుడూ వెన్నంటి ఉంటారని పిలుపునిచ్చారు.
తమకు విద్యాశాఖ మంత్రి కావాలనే ఆశగానీ, కొత్త రాజకీయ పార్టీ ద్వారా అధికారంలోకి రావాలనే లక్ష్యంగానీ లేదని సోనామ్ వాంగ్‌చుక్ స్పష్టం చేశారు. కాక్రోజ్ జనతా పార్టీ అనేది అధికార రాజకీయాల కోసం ఏర్పడిన వేదిక కాదని, ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి చేస్తున్న ఒక పవిత్ర ప్రయత్నమని పేర్కొన్నారు. యువతను మేల్కొలిపి సమాజంలో మార్పు తీసుకురావడమే తమ ఉద్యమ లక్ష్యమన్నారు.
దేశంలో తరచూ జరుగుతున్న పేపర్ లీకులు, పరీక్షల రద్దు వంటి ఘటనలు విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవస్థలో తప్పు జరిగినప్పుడు మంత్రి నుంచి ప్రధానమంత్రి వరకు అందరూ ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిందేనని అన్నారు. విద్యను కేవలం పరీక్షలకు పరిమితం చేయకుండా, విద్యా వ్యవస్థలోని లోపాలను సరిదిద్ది భావితరాలకు బలమైన పునాది వేయాలని సూచించారు.
పర్యావరణ పరిరక్షణ కూడా విద్యంతే ముఖ్యమని సోనామ్ వాంగ్‌చుక్ అన్నారు. రాబోయే తరాలకు చదువు ఎంత అవసరమో, స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన నీరు కూడా అంతే అవసరమని గుర్తు చేశారు. ఈ విషయంలో హైదరాబాద్ ప్రజలు చేస్తున్న పోరాటం దేశానికే ఆదర్శమని కొనియాడారు.
కేబీఆర్ పార్క్ పరిరక్షణ కోసం నగరవాసులు చేపట్టిన ఉద్యమాలు, భూములు, నదులను కాపాడేందుకు చూపుతున్న చొరవను ఆయన అభినందించారు. అడవులను నరికివేసి కాంక్రీట్ నిర్మాణాలు, ఫ్లైఓవర్లు నిర్మిస్తే అభివృద్ధి సాధించినట్టే అనే తప్పుడు భావనలో ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. కాంక్రీట్ అడవులు మన పిల్లల భవిష్యత్తును కాపాడలేవని హెచ్చరించారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రకృతి సంపదలను కాపాడుకోవడానికి ప్రజలందరూ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. అడవులు, నదులు, పర్యావరణాన్ని సంరక్షించేందుకు ప్రజలు గట్టిగా గొంతు విప్పినప్పుడే మార్పు సాధ్యమవుతుందని చెప్పారు. దీర్ఘకాలంలో విద్యను, పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే ముందుగా నిజాయితీగా పనిచేసే ప్రజాస్వామ్య వ్యవస్థ అవసరమని సోనామ్ వాంగ్‌చుక్ అభిప్రాయపడ్డారు.



## పాలమూరులో కాంగ్రెస్‌కు ప్రజలే గుణపాఠం చెబుతారు

- పాలమూరు ప్రాజెక్టును పక్కనపెట్టి జిల్లాకు ద్రోహం
- కొడంగల్‌లో రేవంత్ ఓటమి ఖాయం
- 2028లో ఉమ్మడి పాలమూరులో బీఆర్ఎస్ క్లీన్ స్వీప్
- జిల్లా నేతల సమావేశంలో కేటీఆర్ ధీమా

**హైదరాబాద్, జూన్ 14, ఆశ్వి అప్డేట్స్:**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లా అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ప్రజలు కాంగ్రెస్ పార్టీని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పూర్తిగా తిరస్కరిస్తారని అన్నారు.

మాజీ మంత్రి సి.లక్ష్మారెడ్డి నివాసంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్ష సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలతో జిల్లా రాజకీయ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు.

దాదాపు పూర్తయిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పక్కనపెట్టి, లక్షల ఎకరాలకు సాగునీరు అందకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ద్రోహం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. కమిషన్లు, కాంట్రాక్టుల కోసమే ప్రాజెక్టును నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. ఈ విషయాన్ని పాలమూరు ప్రజలు గమనిస్తున్నారని, ఎన్నికల్లో తగిన సమాధానం చెబుతారని అన్నారు.

తాను మహబూబ్‌నగర్ బిడ్డనని చెప్పుకుంటూ జిల్లా ప్రజలను రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. అన్ని రంగాల్లో జిల్లాకు అన్యాయం చేస్తున్న ముఖ్యమంత్రిని వచ్చే ఎన్నికల్లో కొడంగల్ నియోజకవర్గం నుంచే ప్రజలు ఓడిస్తారని జోస్యం చెప్పారు. గతంలో జరిగినట్లుగానే మరోసారి ప్రజలు గుణపాఠం చెబుతారని వ్యాఖ్యానించారు.

తెలంగాణ ఏర్పాటుకు ముందు మహబూబ్‌నగర్ జిల్లా కరువు, వలసల జిల్లాగా ఉండేదని కేటీఆర్ గుర్తు చేశారు. అలాంటి జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, కరువు, వలసలను తరిమికొట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. అయితే ఆ అభివృద్ధిని ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించడంలో గత ఎన్నికల్లో పార్టీ విఫలమైందన్నారు.

కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రతి గ్రామానికి వివరించాలని పార్టీ నేతలకు కేటీఆర్ సూచించారు. ముఖ్యంగా పాలమూరు జిల్లాకు సాగునీటి ప్రాజెక్టుల విషయంలో కాంగ్రెస్ చేస్తున్న అన్యాయాన్ని ఎండగట్టాలని పిలుపునిచ్చారు.

సమావేశంలో జిల్లాలోని క్షేత్రస్థాయి పరిస్థితులు, ప్రజాభిప్రాయాలు, పార్టీ బలోపేతంపై చర్చ జరిగింది. త్వరలో ప్రారంభం కానున్న ఎస్ఐఆర్ ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం, సభ్యత్వ నమోదు కార్యక్రమాలపై కూడా నియోజకవర్గాల వారీగా సమీక్ష నిర్వహించారు.

ప్రతి గ్రామంలో బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని కేటీఆర్ సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీకి ఆదరణ పెరుగుతోందని, కాంగ్రెస్ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని నేతలు తనకు వివరించినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో బీఆర్ఎస్ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని కేటీఆర్ విశ్వాసం వ్యక్తం చేశారు.

## రేవంత్ ప్రభుత్వానికి ఇంటర్వెల్ పడిపోయింది

మొదటిపేజీ తరువాయి

సమావేశంలో పాల్గొన్న కేటీఆర్ మాట్లాడుతూ, రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ఇప్పటికే ఇంటర్వెల్ పడిపోయిందన్నారు. సినిమా ట్రైలర్ విడుదలైన వెంటనే అది హిట్టా, ఫట్టా అని అంచనా వేస్తారని, అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై తెలంగాణ ప్రజలు ఇప్పటికే తమ తీర్పు ఇచ్చేశారని పేర్కొన్నారు. ఈ ప్రభుత్వ ఫస్ట్ హాఫ్ పూర్తిగా డిజాస్టర్‌గా మారిందని విమర్శించారు. హైదరాబాద్ అభివృద్ధి విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని కేటీఆర్ ఆరోపించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క కొత్త ఇల్లు కూడా నిర్మించలేదని, గత ప్రభుత్వం నిర్మించిన ఇళ్లను మాత్రం కూల్చివేసిందని విమర్శించారు. ప్రజలకు అందాల్సిన ఆర్థిక సహాయాల విషయంలో కూడా ప్రభుత్వం బకాయిలు పెంచుకుంటూ పోతోందని అన్నారు. ఎన్నికల సమయంలో ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని అమలు చేయకుండా యువతను మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్ రెడ్డి తన సొంత పార్టీ నాయకులకే న్యాయం చేయలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి అవినీతి వ్యవహారాలపై కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ రాహుల్ గాంధీకి నివేదిక అందజేశారని కేటీఆర్ ఆరోపించారు. అందుకే ఆమెపై పగ పెంచుకుని తప్పుడు కేసులు పెట్టించారని అన్నారు. మీనాక్షికి రాజ్యసభ అవకాశం రాకుండా కూడా అడ్డుకున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో ప్రారంభించిన రూ.5 భోజన పథకానికి 'అన్నపూర్ణ' అనే పేరు పెట్టామని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ పేరును తొలగించి 'ఇందిరమ్మ'గా మార్చిందని విమర్శించారు. అమ్మవారి పేరును కూడా తొలగించారని, అవకాశం దొరికితే జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ తల్లి పేరును కూడా మార్చేస్తారని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఖైరతాబాద్‌లో త్వరలో ఎన్నికలు వచ్చే అవకాశం ఉందని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త తన డివిజన్‌లో కేసీఆర్ మాదిరిగా పని చేయాలని సూచించారు. ఇతర డివిజన్‌ల వ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేస్తే ఖైరతాబాద్‌లో బీఆర్ఎస్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

## న్యాయం చేయమంటే నరకం చూపించాడు..!

**హనుమకొండ, జూన్ 14, ఆశ్వి అప్డేట్స్:**

హనుమకొండ జిల్లాలో పోలీసు శాఖను కలవరపరిచే ఘటన వెలుగులోకి వచ్చింది. న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన ఓ మహిళను సహాయం చేస్తానంటూ నమ్మించి, నాలుగేళ్ల పాటు లైంగిక దాడులకు పాల్పడినట్లు ఓ ఎస్సైపై ఆరోపణలు రావడం సంచలనం రేపుతోంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం, వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోసం ఆమె హనుమకొండ పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించింది. ఆ సమయంలో అక్కడ ఎస్సైగా పనిచేస్తున్న గోదారి రాజ్‌కుమార్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. భర్తతో విడాకుల వ్యవహారంలో చట్టపరమైన సహాయం అందిస్తానంటూ నమ్మకం కల్పించిన అతడు, ఆమెతో సన్నిహితంగా మెలిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అనంతరం మహిళ బలహీన పరిస్థితిని ఆసరాగా చేసుకుని బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎల్కతుర్తి, హనుమకొండ ప్రాంతాల్లో గత నాలుగేళ్లుగా పలుమార్లు తనపై లైంగిక దాడికి పాల్పడ్డాడని బాధితురాలు ఆరోపించింది. ఈ వేధింపులను భరించలేక చివరకు ఉన్నతాధికారులను ఆశ్రయించినట్లు తెలిపింది. తనకు రక్షణ కల్పించాల్సిన పోలీసు అధికారి తనను మోసం చేసి వేధించాడంటూ బాధితురాలు రాష్ట్ర డీజీపీకి ఫిర్యాదు చేసింది.

# తెలంగాణ పర్యాటక రంగానికి కొత్త ఊపు

**తెలంగాణ బ్యూరో, ఆశ్వి అప్డేట్స్**



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పర్యాటక, సాంస్కృతిక, వారసత్వ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించినట్లు పర్యాటక శాఖ వెల్లడించింది. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం తొలిసారిగా తెలంగాణ టూరిజం పాలసీ 20252030ను అమలు చేసిన ప్రభుత్వం, రూ.15 వేల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి మూడు లక్షల ఉద్యోగాల కల్పన లక్ష్యంగా ముందుకు సాగుతోంది. పీపీపీ విధానంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, సుస్థిర పర్యాటకం, డిజిటల్ ప్రచారం, అంతర్జాతీయ బ్రాండింగ్, నైపుణ్యాభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది.

రాష్ట్రంలో పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగినట్లు శాఖ వెల్లడించింది. 2023లో 5.84 కోట్లుగా ఉన్న దేశీయ పర్యాటకుల సంఖ్య 2024లో 8.82 కోట్లకు చేరగా, 2025లో 8.48 కోట్ల మంది తెలంగాణ పర్యాటక ప్రాంతాలను సందర్శించినట్లు తెలిపింది. విదేశీ పర్యాటకుల రాక కూడా 2024తో పోలిస్తే 2025లో పది శాతానికి పైగా పెరిగినట్లు పేర్కొంది.

**పెట్టుబడుల ఆకర్షణలో ముందడుగు**

టూరిజం కాన్‌క్లేవ్2025 ద్వారా 24 మంది పెట్టుబడిదారుల నుంచి రూ.15,285 కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చినట్లు వెల్లడించింది. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025లో 18 మంది పెట్టుబడిదారులతో రూ.8,456 కోట్ల విలువైన అవగాహన ఒప్పందాలు కుదిరాయని, వీటి ద్వారా 10 వేల ప్రత్యక్ష, 30 వేల పరోక్ష ఉద్యోగాలు లభించనున్నాయని తెలిపింది.

కేంద్ర ప్రభుత్వ సహకారంతో రూ.181 కోట్ల విలువైన పర్యాటక ప్రాజెక్టులు మంజూరయ్యాయి. బుద్ధవనం, రామప్ప, సోమశిల, నిజాం సాగర్, బల్కంపేట ఆలయ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం రూ.289 కోట్లతో 71 పర్యాటక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపింది.

**రోప్‌వేలు.. అడ్వెంచర్ టూరిజానికి ప్రాధాన్యం**

భువనగిరి కోట, ఖమ్మం కోటల వద్ద తొలిసారిగా రోప్‌వే ప్రాజెక్టులు చేపట్టగా, సోమశిల, హుస్సేన్ సాగర్, కోటిపల్లి ప్రాంతాల్లో అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్ ప్రారంభించారు. హుస్సేన్ సాగర్‌లో ముచుకుంద లగ్జరీ డబుల్ డెక్ క్రూయిజ్ సేవలు ప్రారంభించగా, లక్నాపూర్, నిజాంసాగర్, వరదవెల్లి ప్రాంతాల్లో బోటింగ్ సౌకర్యాలను విస్తరించారు.

**ప్రపంచ వేదికపై తెలంగాణ**

72వ మిస్ వరల్డ్2025 పోటీలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపు లభించిందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రాష్ట్ర సంస్కృతి, వారసత్వం, కళలు, హస్తకళలు, పర్యాటక ప్రాంతాలను ప్రపంచానికి పరిచయం చేసే అవకాశం ఈ కార్యక్రమం ద్వారా లభించిందన్నారు.

ప్రతి ఏడాది నిర్వహిస్తున్న ఇంటర్నేషనల్ కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ దేశ విదేశాల సందర్శకులను ఆకట్టుకుంటోందన్నారు. 2026 ఉత్సవాల్లో 18 దేశాల ప్రతినిధులు, 37 మంది అంతర్జాతీయ కైట్ ఫ్లయర్లు, 55 మంది దేశీయ కైట్ ఫ్లయర్లు పాల్గొన్నట్లు వెల్లడించారు. హాట్ ఎయిర్ బెలూన్, డ్రోన్ ఫెస్టివల్‌ల ద్వారా పర్యాటక రంగానికి కొత్త ఆకర్షణలు జోడించినట్లు చెప్పారు.

**బతుకమ్మకు గిన్నిస్ రికార్డులు**

బతుకమ్మ ఉత్సవాలు2025 సందర్భంగా తెలంగాణ రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించిందని మంత్రి తెలిపారు. అతిపెద్ద బతుకమ్మ పూల అలంకరణతో పాటు 1,354 మంది మహిళలతో నిర్వహించిన సమన్వయ బతుకమ్మ నృత్య ప్రదర్శన ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుందని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో సోమశిల, నిర్మల్ గ్రామాలు 'బెస్ట్ టూరిజం విలేజ్ ఆఫ్ ఇండియా2024' అవార్డులు అందుకోగా, హైదరాబాద్‌కు 'బెస్ట్ హెరిటేజ్ టూరిజం' మరియు 'బెస్ట్ ఇండిజినస్ క్యులినరీ డెస్టినేషన్' అవార్డులు లభించాయని తెలిపారు.

**కళాకారుల సంక్షేమానికి ప్రాధాన్యం**

రాష్ట్రంలో 1,690 మంది వృద్ధ కళాకారులకు నెలకు రూ.3,016 చొప్పున పెన్షన్ అందిస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. రవీంద్రభారతిలో నిర్వహించిన 99 రోజుల తెలంగాణ ప్రజా కళా కార్యక్రమం ద్వారా జానపద, గిరిజన, సంప్రదాయ కళారూపాలకు ప్రోత్సాహం లభించిందన్నారు. పురావస్తు రంగంలో ఫణిగిరి, మాదుముల ప్రాంతాల్లో తవ్వకాల ద్వారా చారిత్రక ఆధారాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ఫణిగిరిలో బౌద్ధ మ్యూజియం ఏర్పాటు చేసి పలు చారిత్రక కట్టడాల సంరక్షణ చేపట్టినట్లు వివరించారు.

**తెలంగాణకు కొత్త గుర్తింపు**

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పర్యాటకం, సంస్కృతి, వారసత్వ రంగాల్లో చేపట్టిన కార్యక్రమాల ఫలితంగా తెలంగాణ దేశ, విదేశాల్లో ప్రత్యేక గుర్తింపు పొందుతోందన్నారు. పెట్టుబడులు, ఉపాధి, పర్యాటకాభివృద్ధి, వారసత్వ పరిరక్షణ, కళాకారుల సంక్షేమం అనే ఐదు ప్రధాన లక్ష్యాలతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. తెలంగాణను ప్రపంచస్థాయి పర్యాటక, సాంస్కృతిక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు మరింత వేగంగా పనిచేస్తామని స్పష్టం చేశారు.

# అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి

మొదటిపేజీ తరువాయి



సలహాదారు సుదర్శన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

జూన్ 9న హైదరాబాద్‌లో కురిసిన భారీ వర్షాల సమయంలో ఏర్పడిన పరిస్థితులపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. సైబరాబాద్ సహా పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ మున్సిపల్, పోలీసు, ట్రాఫిక్ శాఖలు తగిన స్థాయిలో స్పందించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

వర్షాల సమయంలో మున్సిపల్, పోలీసు అధికారుల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపించిందని సీఎం అన్నారు. దీనికి కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీని ఆదేశించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు.

వర్షాలు కురిసే సమయంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, హైడ్రా, ట్రాఫిక్, జలమండలి, సివిల్ పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండాలని స్పష్టం చేశారు. అవసరమైతే తాను కూడా రోడ్లపైకి వస్తానని చెప్పారు. వర్షాల కారణంగా ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడితే ఇకపై బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

వాటర్ లాగింగ్ పాయింట్లు, ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా ఉండే ప్రాంతాలపై ముందుగానే ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ విభాగంలో ఉన్న ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డీజీపీకి ఆదేశించారు.

వర్షాల కారణంగా చెట్లు కూలి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంపై కూడా ముఖ్యమంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ పునరుద్ధరణ వేగంగా చేపట్టాలని, అవసరమైన చోట్ల మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.

రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల వద్ద వర్షాకాలంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్వహణ మాన్యువల్ ప్రకారం జరగాలని, సంబంధిత ఇంజినీర్లు స్థానికంగానే అందుబాటులో ఉండాలని చెప్పారు. అనుమతి లేకుండా విధులు వదిలి వెళ్లే అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

వ్యవసాయ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో విత్తనాలు, యూరియా సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వ్యవసాయ శాఖకు సూచించారు. రైతు వేదికల ద్వారా యూరియా పంపిణీ చేపట్టాలని, రైతులకు నాణ్యమైన విత్తనాలపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.

తాగునీటి కలుషితాన్ని నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను ఆదేశించారు. నీటి నమూనాలను ఎప్పటికప్పుడు పరీక్షించాలని సూచించారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో ఉంచుకుని వైద్య ఆరోగ్య శాఖ పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని చెప్పారు.

పోలీసు, ట్రాఫిక్, ఫైర్, హైడ్రా, విపత్తు నిర్వహణ సంస్థలతో సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షించాలని డీజీపీని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

## ధాన్యం సేకరణలో తెలంగాణ రికార్డు

మొదటిపేజీ తరువాయి

చేసింది. దళారీల ప్రమేయం లేకుండా, పారదర్శక విధానంలో చెల్లింపులు జరపడం ద్వారా రైతుల్లో విశ్వాసాన్ని పెంపొందించింది.


రైతులు తమ ధాన్యాన్ని సులభంగా విక్రయించుకునేలా రాష్ట్రవ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంతాల రైతులకు సైతం అందుబాటులో ఉండేలా కొనుగోలు వ్యవస్థను విస్తరించింది.

ధాన్యం సేకరణ, రవాణా, నిల్వ, మిల్లింగ్, చెల్లింపుల ప్రక్రియలను సమన్వయంతో నిర్వహించడంతో రైతులకు వేగంగా డబ్బులు అందుతున్నాయి. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన 48 నుంచి 72 గంటల్లోనే రైతుల ఖాతాల్లో చెల్లింపులు జమ కావడం విశేషం.

రైతు సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ సాగునీటి వసతుల విస్తరణ, మద్దతు ధరతో ధాన్యం కొనుగోలు, వేగవంతమైన చెల్లింపుల ద్వారా తెలంగాణ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేస్తోంది. దీంతో రాష్ట్రం దేశంలోనే వ్యవసాయ అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తోంది.

# కనగల్‌లో సీఎం సభకు భారీ ఏర్పాట్లు

**కనగల్, జూన్ 14, ఆశ్వి అప్డేట్స్:**



నల్గొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలో ఈ నెల 17న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్న బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పరిశీలించారు. సభా స్థలం, హెలిప్యాడ్, హ్యాం రోడ్ల పైలాన్ ప్రాంతాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ఒకే రోజు రాష్ట్రవ్యాప్తంగా హ్యాం విధానంలో చేపట్టనున్న డబుల్ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కనగల్ మండలం ధర్వేశిపురం నుంచి డిండి వరకు నిర్మించనున్న రహదారితో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు.

హ్యాం రోడ్లతో పాటు మరో రూ.7 వేల కోట్ల వ్యయంతో గ్రామాల నుంచి మండలాలకు, మండలాల నుంచి జిల్లా కేంద్రాల వరకు పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో డబుల్ రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ పనులకు కూడా త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన జరగనున్నట్లు తెలిపారు.

గత ఏడాది కాలంగా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి అవసరమైన నిధులు సమకూర్చుకుని రాష్ట్రవ్యాప్తంగా రహదారుల అభివృద్ధి చేపడుతున్నామని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రంలో 34 ప్యాకేజీలుగా విభజించి సుమారు 6,300 కిలోమీటర్ల రహదారులను డబుల్ రోడ్లుగా మార్చనున్నట్లు చెప్పారు. నల్గొండ జిల్లాకు కీలకమైన ఎస్ఎల్బీసీ సొరంగం పనులను కూడా 2028 ఆగస్టు నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తైతే జిల్లాలో రెండు పంటలకు సాగునీరు అందుతుందని పేర్కొన్నారు. ఇది తన కలల ప్రాజెక్టు అని అన్నారు.

ఏఆర్పీ కాలువల లైనింగ్ పనులకు రూ.450 కోట్ల నిధులు మంజూరయ్యాయని, వాటి శంకుస్థాపన కూడా అదే రోజు జరగనున్నట్లు వెల్లడించారు. నల్గొండ నగరంలో తాగునీటి సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయించామని, ఆ పనులకు కూడా ముఖ్యమంత్రి కనగల్‌లోనే శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

**రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది**

రైతు సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి చెప్పారు. ఈ ఏడాది నల్గొండ నియోజకవర్గంలో 2.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి కాగా, జిల్లా వ్యాప్తంగా రూ.1,800 కోట్ల విలువైన ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. రోడ్ల అభివృద్ధితో పరిశ్రమలు, వ్యవసాయం అభివృద్ధి చెందడంతో పాటు రోడ్డు ప్రమాదాలు కూడా తగ్గుతాయని అన్నారు. కేంద్ర నిధులతో నల్గొండ నుంచి ధర్వేశిపురం వరకు స్ట్రెయిట్ రోడ్ నిర్మాణం చేపట్టామని, కనగల్ జంక్షన్ అభివృద్ధిని కూడా హ్యాం రోడ్ల ప్రాజెక్టులో చేర్చినట్లు తెలిపారు. హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు గ్రీన్ ఫీల్డ్ హైవేకు ఆమోదం లభించిందని, దానికి అనుబంధంగా బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ కూడా సిద్ధమవుతోందని మంత్రి వెల్లడించారు. ముఖ్యమంత్రి సభకు సుమారు లక్ష మంది హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తాగునీరు, టెంట్లు, పార్కింగ్, రవాణా, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు.

సభా వేదిక, లైటింగ్, ప్రత్యక్ష ప్రసారం, వాహనాల పార్కింగ్ ఏర్పాట్లపై అధికారులకు ప్రత్యేక సూచనలు చేసిన మంత్రి, ముఖ్యమంత్రి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసా, మహిళలకు వడ్డీ లేని రుణాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, అల్పాహారం, ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని మంత్రి వివరించారు.

# ప్రియమైన విద్యార్థులారా



**ఆశ్వి అప్డేట్స్ నల్లగొండ జూన్ 14:**

నూతన విద్యా సంవత్సరంలోకి అడుగుపెడుతున్న మీ అందరికీ నల్గొండ జిల్లా పోలీసు శాఖ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ విద్యా సంవత్సరాన్ని ఉత్సాహం క్రమశిక్షణ మరియు బాధ్యతతో ప్రారంభించి విజయాలను సాధించాలని ఆకాంక్షిస్తున్నాము అని తెలిపారు.ఈ విద్యా ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న సందర్భంగా, మీ భద్రత మరియు బాధ్యతాయుతమైన ప్రవర్తనకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన విషయాలను గుర్తుచేయాలనుకుంటున్నాను అని అన్నారు.

**రోడ్డు భద్రత :**

మీ భద్రత పాఠశాల/కళాశాల ప్రాంగణంలోకి ప్రవేశించే ముందే ప్రారంభమవుతుంది. పాఠశాల లేదా కళాశాలకు వెళ్లేటప్పుడు మరియు తిరిగి వస్తున్నప్పుడు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించండి. రెండు చక్రాల వాహనాలపై ప్రయాణించే సమయంలో మీ తల్లిదండ్రులు లేదా సంరక్షకులు హెల్మెట్ ధరించేలా, నాలుగు చక్రాల వాహనాలు నడిపేటప్పుడు సీట్ బెల్ట్ ధరించేలా వారికి గుర్తు చేయండి. మొబైల్ ఫోన్ల వంటి దృష్టి మళ్లించే అంశాలను ఉపయోగించవద్దు. గుర్తుంచుకోండి

**" రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత".**

**సైబర్ భద్రత మరియు ఆన్లైన్ మోసాల నుండి రక్షణ :**

నేటి డిజిటల్ ప్రపంచంలో సాంకేతికత విద్య కోసం అపారమైన అవకాశాలను అందిస్తున్నప్పటికీ కొన్ని ప్రమాదాలను కూడా కలిగిస్తుంది. ఇంటర్నెట్ మరియు సోషల్ మీడియాను ఉపయోగిస్తున్నప్పుడు అప్రమత్తంగా ఉండండి. మీ వ్యక్తిగత సమాచారం పాస్వర్డ్లు, OTP లు, బ్యాంకింగ్ వివరాలు లేదా ఇతర గోప్యమైన సమాచారాన్ని ఎప్పుడూ ఆన్లైన్లో ఎవరికీ పంచుకోవద్దు. అనుమానాస్పద సందేశాలు, అపరిచితుల నుండి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్టులు, మోసపూరిత లింకులు, నకిలీ ఆఫర్లు పట్ల జాగ్రత్తగా ఉండండి. ఏదైనా అనుమానాస్పద ఆన్లైన్ కార్యకలాపం కనిపిస్తే వెంటనే మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం లేదా సైబర్ హెల్ప్లైన్కు సమాచారం ఇవ్వండి. మాదకద్రవ్యాలు మరియు హానికర పదార్థాలకు దూరంగా ఉండండి. మాదకద్రవ్యాలు, పొగాకు, మద్యం మరియు ఇతర హానికర పదార్థాల వినియోగం మీ ఆరోగ్యం, విద్య మరియు భవిష్యత్ లక్ష్యాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. చెడుప్రభావాలు మరియు తోటి స్నేహితుల ఒత్తిడికి లోనుకాకండి. మీకు అసౌకర్యంగా అనిపించే పరిస్థితులు ఎదురైతే మీ తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం పొందండి. ఆరోగ్యకరమైన మనస్సు మరియు శరీరమే విజయవంతమైన జీవితానికి పునాది. మీ సహ విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల సిబ్బందిని గౌరవించండి. ఇతరులను బాధించే ఆటపట్టించడం, వివక్ష లేదా ఏ విధమైన అనుచిత ప్రవర్తనను నివారించండి. చదువు, వ్యాయామం, వినోదం మరియు తగిన విశ్రాంతి కలిగిన సమతుల్య దినచర్యను పాటించడం ద్వారా మీ శారీరక మరియు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోండి. ఈ విద్యా సంవత్సరాన్ని మీరు ఆసక్తి సంకల్పం, నిజాయితీ మరియు ఉత్సాహంతో స్వాగతించాలని కోరుకుంటున్నాను. పెద్ద కలలు కనండి, కష్టపడి పనిచేయండి, సవాళ్లను స్వీకరించండి.

1098 చైల్డ్ హెల్ప్ లైన్, 100/112 సమగ్ర అత్యవసర స్పందన సేవ, 1930 సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ మరియు 8712670266 నల్లగొండ జిల్లా మాదకద్రవ్యాల నిర్మూలన హెల్ప్ లైన్.

# మహిళల రక్షణే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం: జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS



**ఆశ్వి అప్డేట్:**
**నారాయణపేట జోన్ 14**

నారాయణపేట జిల్లాలో మహిళలు, యువతులు, బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ షీ టీమ్స్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ యూనిట్లు నిరంతరం పనిచేస్తున్నాయని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలు, బాలికలు ఆకతాయిల వేధింపులు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, గృహహింస, లైంగిక వేధింపులు లేదా ఇతర ఏ విధమైన అన్యాయాలకు గురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు.

విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థినులు బస్టాండ్లు, పాఠశాలలు, కళాశాలలు, గ్రామాలు, కాలనీలు వంటి ప్రాంతాల్లో ఈవ్ టీజింగ్, ర్యాగింగ్కు గురైనప్పటికీ, ఉద్యోగ మహిళలు తమ కార్యాలయాల్లో వేధింపులకు గురైనప్పటికీ వెంటనే షీ టీమ్ పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. మహిళలు మరియు బాలికలపై జరిగే వేధింపుల విషయంలో ఎలాంటి రాజీ లేకుండా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

గృహహింసకు గురవుతున్న మహిళలు కూడా మౌనంగా బాధపడకుండా ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని, బాధితులకు అవసరమైన న్యాయం అందించేందుకు పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. మహిళల ఫిర్యాదులపై సత్వర స్పందనతో పాటు నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

జిల్లా వ్యాప్తంగా షీ టీమ్స్ ఆధ్వర్యంలో గ్రామాలు, పట్టణాల్లో మహిళా భద్రత, సైబర్ నేరాల నివారణ, సామాజిక మాధ్యమాల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫేస్బుక్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ తదితర సోషల్ మీడియా వేదికలను ఉపయోగించే సమయంలో అపరిచితులతో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని, ఫోటోలు, వీడియోలు పోస్ట్ చేసే సమయంలో వ్యక్తిగత భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మైనర్ బాలికలను వేధించడం, లైంగికంగా వేధించడం వంటి ఘటనల్లో సంబంధిత నిందితులపై పోక్సో చట్టం కింద కఠిన కేసులు నమోదు చేసి చట్టప్రకారం శిక్షించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. నేరుగా పోలీస్ స్టేషన్కు వెళ్లి ఫిర్యాదు చేయలేని మహిళలు, బాలికలు లేదా వారి కుటుంబ సభ్యులు షీ టీమ్ ఫోన్ నెంబర్ 8712670398 లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని సూచించారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు .

# భార్యను హతమార్చిన భర్త



**పెద్దపల్లి జిల్లా/ అంతర్గాం**

పోలీస్ స్టేషన్ పరిధిలోని ముర్మూరు గ్రామంలో భర్త చేతిలో భార్య హతమైంది...నంది లక్ష్మి మీద అనుమానంతో...నిన్న అర్ధరాత్రి అమె భర్త రాయమల్లు గొడ్డలితో నరికి హత్య చేశాడు... ఘటనా స్థలాన్ని రామగుండం సిఐ కృష్ణ కుమార్, అంతర్గాం ఎస్ఐ వెంకట స్వామి పరిశీలన చేశారు...విచారణ చేపట్టారు... లక్ష్మి మృత దేహాన్ని"ఖని" ప్రభుత్వ జనరల్ అసుపత్రి మార్చురీకి తరలించారు...వీరికి ముగ్గురు పిల్లలున్నారు...

# అధికారులు, ప్రజా నాయకుల కన్ సైగలో అక్రమ ఇసుక తరలింపు

- **అమరచింత, నర్వ మండలాలకు రాత్రులలో కదులుతున్న అక్రమ ఇసుక**
- **మద్దూర్ కు ఒక్క కిలోమీటర్ దూరంలో అక్రమ ఇసుక డంపులు.**
- **అధికారులకు చెప్పిన, పేపర్లో వచ్చిన, దున్నపోతు మీద ఓనపడినట్లే డబ్బు మత్తులో జోగుతున్నారు.**

**ఆశ్వి అప్డేట్స్ దేవరకద్ర జూన్ 14:**



చిన్న చింతకుంట మండల పరిధిలోని మద్దూరు గ్రామంలో 20 ట్రాక్టర్లు రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము 5 గంటల వరకు యదేచ్చగా అక్రమ ఇసుక దందా లో రాటి తేలిన మద్దూరు గ్రామ ట్రాక్టర్ల యాజమాన్యం. చోట బడా నాయకులకు ఎవరి ముడుపులు వారికి ఇస్తున్నాం. మా కన్నతల్లి వోగుల్లో ఇసుకను తీసుకపోతే మీరు ఎందుకు బాధపడుతున్నారు అంటున్నారు ట్రాక్టర్ యజమానులు. మద్దూర్ నుంచి ఒక్క కిలోమీటర్ దూరం ఉంద్యాలకు పోయే రోడ్డు వ్యవసాయ పొలం ఒక ఇంటి దగ్గర అక్రమ ఇసుక డంపుల్లే డంపులు, ఉంద్యాల గ్రామంలో వీధి వీధిన ఆరు ఏడు ఎనిమిది ట్రాక్టర్ల వరకు ఇసుక నిల్వ చేశారని గ్రామస్తుల ద్వారా తెలిసింది. అదే గ్రామంలో ఎవరికి అవసరం ఉంటే వారికి ఐదు వేల రూపాయల చొప్పున అమ్ముతున్నట్లు సమాచారం ఉంది. నాగిరెడ్డిపల్లి, చిన్న కడుమూరు, యాంకి, రాంపురం కు రూ7000 వేలకు పైచిలుకు అమ్ముతున్నట్లు గ్రామస్తుల ద్వారా తెలుస్తుంది. మద్దూరు, ఉంద్యాల గ్రామాలలో రాత్రులలో ట్రాక్టర్స్ శబ్దాలకు రోడ్డు పక్కన ఉన్న ఇండ్లవారము నిద్ర పట్టడం లేదంటున్న ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత కొన్ని నెలల నుంచి చిన్న చింతకుంట అధికారుల దృష్టికి ఎవరు తీసుకుపోయిన పట్టించుకోవడం లేదు అంటున్నారు ఆయా గ్రామస్తులు. సంబంధిత రెండు జిల్లాల అధికారులు అక్రమ ఇసుకపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు.





# అర్హులైన ప్రతి ఒక్క ఓటు కాపాడుకోవటమే లక్ష్యం...

- **కాంగ్రెస్ శ్రేణులకు ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పిలుపు...**
- **ఎస్ఐఆర్ పట్ల క్షేత్రస్థాయిలో సమన్వయంతో సాగాలని సూచన...**
- **బొంగ్లూర్ లో నియోజకవర్గ కాంగ్రెస్ బీఎల్ఏలకు శిక్షణా కార్యక్రమం...**
- **హాజరైన ఎంపీ చామల, పీసీసీ ట్రైనింగ్ కమిటీ ఛైర్మన్ రామ్మోహన్ రెడ్డి...**

**ఆశ్వి అప్డేట్స్ జూన్ 14:**

రాష్ట్రంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్) వేళ నియోజకవర్గంలో అర్హులైన ప్రతీ ఓటునూ కాపాడుకోవటమే లక్ష్యంగా కాంగ్రెస్ శ్రేణులు పనిచేయాలని ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీకి చెందిన బూత్ లెవెల్ ఏజెంట్స్ కు శిక్షణా కార్యక్రమాన్నిబొంగ్లూర్ గేటు వద్ద ప్రమిదా గార్డెన్స్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, పీసీసీ ట్రైనింగ్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియతో కాంగ్రెస్ ఓట్లు పెద్ద ఎత్తున తొలగించబడినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో నిర్లక్ష్యం వహిస్తే... పార్టీకి నష్టం చేకూర్చే ప్రమాదం ఉందని చెప్పారు. బీఎల్ఓలతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో సాగుతూ.... ఒక్క ఓటు కూడా వృథా అవ్వకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత ఉంటుందని చెప్పారు. అనంతరం, ఎంపీ చామల మాట్లాడుతూ.... కాంగ్రెస్ పార్టీపై జరిగే కుట్రలను అడ్డుకోవాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందన్నారు. ఇంటింటికీ తిరిగి ఓటర్ల వివరాలను సేకరించే సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా యాక్టివ్గా ఉండి, ప్రతి ఇంటినీ సందర్శించాల్సిన అవసరం ఉందన్నారు. ట్రైనింగ్ కమిటీ ఛైర్మన్ రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ.... ఓటరు జాబితా ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించడంలో బీఎల్ఏల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. ఎలాంటి పొరపాటు గమనించినా వెంటనే గుర్తించాలని చెప్పారు. అభ్యంతరాలపై అప్పీల్ కు వెళ్లే అవకాశం ఉన్నందున, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని చెప్పారు. నియోజకవర్గ బీఎల్ఓల శిక్షకుడు చైతన్య కృష్ణారెడ్డి... ఓటరు జాబితా పరిశీలన, సవరణల ప్రక్రియ, ఇంటింటికి నిర్వహించాల్సిన కార్యక్రమాలు, ప్రజలతో సమన్వయం వంటి అంశాలపై వివరంగా సూచనలు అందజేశారు. ఈ శిక్షణా కార్యక్రమానికి నియోజకవర్గంలోని కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్స్, పార్టీ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# ప్రలోభానికి గురవుతున్న న్యాయవ్యవస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉంది : మధుయాష్కి గౌడ్

- **తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడిగా విజయం సాధించిన వెంకట్ యాదవ్ కు ఘన సన్మానం**

**ఆశ్వి అప్డేట్స్ జూన్ 14:**



తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యునిగా రెండోసారి ఘనవిజయం సాధించిన సీనియర్ న్యాయవాది చలకాని వెంకట్ యాదవ్ గారి విజయోత్సవ సభ టీపీసీసీ ప్రచార కమిటీ ఛైర్మన్ మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్ గారు హాజరయ్యారు. భాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన విజయోత్సవ సభకు హాజరై వెంకట్ యాదవ్ గారిని సన్మానించి, అభినందనలు తెలిపారు.


ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో న్యాయవాదులను సమీకరించి ఎంతో కీలకంగా పోరాటం చేసిన చలకాని వెంకట్ యాదవ్ గారు బార్ కౌన్సిల్ సభ్యుడిగా రెండోసారి గెలుపొందడం అభినందనీయమన్నారు. గతంలో హైకోర్టు స్టాండింగ్ కౌన్సిల్ గా పనిచేసిన చలకాని వెంకట యాదవ్ గారికి న్యాయవాదుల సమస్యలు తెలుసని, వారి సమస్యల పరిష్కారానికి సమర్థవంతంగా పనిచేస్తారని పేర్కొన్నారు. బార్ కౌన్సిల్ సభ్యులుగా పేద వర్గాలకు అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ న్యాయవాదులకు ఇచ్చిన హామీలను అమలుకు వెంకట్ యాదవ్ కృషి చేయాలని, ఇందుకు తన వంతుగా సహకారం అందిస్తానని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత అత్యధికంగా నష్టపోయింది ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలేనన్నారు. సామాజిక న్యాయం కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. బిజెపి పాలనలో ప్రలోభానికి గురవుతున్న న్యాయవ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందని పేర్కొన్నారు. చలకాని వెంకట్ యాదవ్ మాట్లాడుతూ.. కిరణ్ కుమార్ రెడ్డి గారి ప్రభుత్వ హాయంలో హైకోర్టు, జిల్లా కోర్టులలో స్టాండింగ్ కౌన్సిల్, జేపీ తదితర పోస్టులలో బీసీలకు ప్రాతినిధ్యం కల్పించి న్యాయం చేయాలని మధుయాష్కి పట్టుబట్టి 42% కోట ఇప్పించారని వివరించారు. బీసీలకు 42% అనే నినాదం మధుయాష్కీ గారి ద్వారా ఆ రోజే నినాదంగా మారిందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ నెలికంటి సత్యం గారు, ట్రైకార్ ఛైర్మన్ డాక్టర్ బెల్లయ్య నాయక్ , పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్లర్ శ్రీనివాస్ , స్టేట్ పోలీస్ కంప్లైంట్ అథారిటీ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, అఖిల భారత యాదవ సంఘం నేషనల్ జనరల్ సెక్రెటరీ లక్ష్మణ్ యాదవ్ పాల్గొన్నారు.

# గోపాల్ పేట మండలంలో గొర్రెల కాపరి హత్య

- **న్యాయం చేయాలని బాధితులు ఆందోళన**
- **వనపర్తి ఏరియా ఆసుపత్రిలో మృతుడు బాల చంద్రయ్య**
- **వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్ ముందు బాధితుల రోదనలు**

**మహబూబునగర్ జూన్ 15 ( అశ్విఅప్డేట్స్ )**





వనపర్తి జిల్లా పరిధిలోని వనపర్తి పోలీస్ సర్కిల్ పరిధిలోని గోపాల్ పేట పోలీస్ స్టేషన్ చెన్నూరు గ్రామ శివారులో ఏదుల మండల పరిధిలోని మాచుపల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరి బాల చంద్రయ్య వయస్సు (55) అనే వ్యక్తిని హత్య చేసిన సంఘటనలో వనపర్తి పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ( ఇన్విస్టిగేషన్) అధికారి సుగంధం రత్నం విచారణ కొనసాగిస్తున్నారు. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గోపాల్పేట మండల కేంద్రానికి చెందిన మందడి లక్ష్మి దగ్గర గొర్రెలు కాయడానికి జీతం చేస్తున్న బాల చంద్రయ్యను గోపాల్పేట మండల కేంద్రానికి చెందిన బోయ మహేష్ అనే వ్యక్తితో పాటు మరి కొంతమంది అక్రమ సంబంధం నెపంతో కర్రలతో దాడి చేసి హత్య చేసినట్లు తెలుస్తుంది. మృతి చెందిన బాల చంద్రయ్య కుటుంబ సభ్యులు తమకు న్యాయం చేయాలని రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేస్తున్న విషయం తెలుసుకున్న వనపర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ సుగంధం రత్నం తో పాటు గోపాల్ పేట ఎస్సై శశిధర్ ,వనపర్తి టౌన్ ఎస్ఐ హరి ప్రసాద్, వనపర్తి రూరల్ ఎస్సై హరీషికేష్, పెద్దమందడి ఎస్సై జలంధర్ రెడ్డి, మదనపూర్ ఎస్సై జగదీష్, వనపర్తి ట్రాఫిక్ ఎస్ఐ సురేంద్ర ఏదుల,రేవల్లి ఎస్సై తో పాటు మరికొంతమంది పోలీసులు బాధితులకు నచ్చజెప్పి ఆందోళన విరమించారు. తమకు న్యాయం చేసే వరకు ఎలాంటి ఫిర్యాదు చేయమని మృతుని కుటుంబ సభ్యులు చెప్పినప్పటికీ ఈ కేసు విషయంలో వనపర్తి పోలీసులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి నిందితులను అరెస్టు చేస్తామని హామీ ఇచ్చినట్టు తెలుస్తుంది. ఈ హత్య కేసులో ఏది ఏమైనప్పటికీ వనపర్తి పోలీసులు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. పూర్తి వివరాలు వనపర్తి సర్కిల్ ఇన్స్పెక్టర్ సుగంధం రత్నం విలేకరుల సమావేశంలో వెల్లడించే అవకాశం కనిపిస్తుంది. వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్ ముందు మృతుని బంధువులు రోదనలు వినిపిస్తున్నాయి. మృతి చెందిన బాల చంద్రయ్య వనపర్తి ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. మరికొన్ని పూర్తి వివరాలకు కొద్దిసేపట్లో తెలుస్తాయి. అంతవరకు వేచి ఉండండి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పూర్తిస్థాయిలో భద్రత బందోబస్తు ఏర్పాటు చేశారు.

# ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీపై ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలి

- మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్ డిమాండ్

**ఆశ్వి అప్డేట్స్**

రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల పేరుతో సాగిస్తున్న దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం తక్షణమే సమగ్ర "ఫీజుల నియంత్రణ చట్టం" తీసుకురావాలని టీఆర్ఎస్ పార్టీ జిల్లా ఇంచార్జీ మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు.




విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చిన ప్రైవేట్ విద్యాసంస్థలు సామాన్య, మధ్యతరగతి కుటుంబాలపై ఆర్థిక ఉక్కుపాదం మోపుతున్నాయని ఆయన తీవ్రంగా విమర్శించారు. అడ్మిషన్ ఫీజులు, ట్యూషన్ ఫీజులు, ప్రత్యేక ఫీజులు అంటూ వేలాది రూపాయలు వసూలు చేస్తూ తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నారని మండిపడ్డారు.
విద్యా ప్రమాణాలు పెంచడంపై దృష్టి పెట్టాల్సిన యాజమాన్యాలు కేవలం లాభాలే లక్ష్యంగా వ్యవహరిస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులను ఆర్థికంగా దోచుకుంటున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా పాఠశాలల ప్రాంగణాల్లోనే పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంలు, టైలు, బెల్టులు విక్రయిస్తూ బహిరంగ దోపిడీకి పాల్పడుతున్నారని అన్నారు. బయట మార్కెట్లో తక్కువ ధరలకు లభించే వస్తువులను పాఠశాలల్లో రెట్టింపు ధరలకు కొనాలని తల్లిదండ్రులపై ఒత్తిడి తీసుకురావడం అత్యంత అన్యాయమని పేర్కొన్నారు. ఇది విద్యా రంగంలో కొనసాగుతున్న సంఘటిత దోపిడీకి నిదర్శనమని అన్నారు. ఇంత పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడం వెనుక కారణాలేమిటని ప్రశ్నించారు. అధికారులు తనిఖీలు చేయకుండా, ఫిర్యాదులను పట్టించుకోకుండా ఉండటం వల్లే ప్రైవేట్ యాజమాన్యాలు మరింత రెచ్చిపోతున్నాయని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకువచ్చి ప్రతి పాఠశాల ఫీజు నిర్మాణాన్ని పారదర్శకంగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్కూల్ క్యాంపస్‌లలో పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సామాన్యుడి పిల్లలకు విద్య అందని ద్రాక్షగా మారుతున్న ఈ పరిస్థితిని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందని హెచ్చరించారు. విద్య హక్కు కానీ వ్యాపారం కాదని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడే ప్రైవేట్ విద్యా మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన సమయం ఆసన్నమైందని మెట్టుకాడి ప్రభాకర్ ముదిరాజ్ పేర్కొన్నారు.

# పాఠశాలతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి...

- మండల విద్యాధికారి దీప్లా రాథోడ్

**చిన్న శంకరంపేట జూన్ 14 ఆశ్వి అప్డేట్స్...**



పాఠశాల ఆవరణతో పాటు పాఠశాల తరగతి గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని వర్షపు నీరు నిలువ లేకుండా చూసుకోవాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మండల విద్యాధికారి దీప్లా రాథోడ్ సూచించారు, చిన్న శంకరంపేట మండల కేంద్రంతో పాటు మండలంలోని మొత్తం 56 పాఠశాలలకు పుస్తకాల పంపిణీ నిర్వహించారు, ఈ సందర్భంగా మండల విద్యాధికారి వీపుల రాథోడ్ మాట్లాడుతూ మండలంలోని 56 పాఠశాలలకు 30 వేల పుస్తకాలు అవసరం ఉండగా 18 వేల పుస్తకాలు రావడం జరిగిందని మరో 12 వేల పుస్తకాలు త్వరలో రావడం జరుగుతుందని ఆయన సూచించారు పాఠశాల క్రీడా మైదానంలో ఎక్కడ కూడా గుంతలు లేకుండా నీరు నిలువ లేకుండా చూసుకోవాలని పాఠశాల తరగతి గదులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈనెల 15వ తేదీ నుండి పాఠశాల పునప్రారంభం అవుతున్న దృష్ట పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు, విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధనతోపాటు పౌష్టిక ఆహారాన్ని మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులంతా కూడా సమయ పాలన పాటించాలని ఫేస్ రికగ్నైజేషన్ సిస్టం ద్వారా హాజరు కావాలని ఆయన తెలిపారు, విద్యార్థులకు యూనిఫామ్స్ ఇంకా రాలేవని త్వరలో రాగానే పంపిణీ చేయడం జరుగుతుందని అన్నారు. పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకుంటూ విద్యార్థులకు సురక్షితంగా ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు.





# విధానపరమైన నిర్ణయాలతోనే ఇంగ్లీష్ భాష సులువు-కర్నాటి సురేంద్రబాబు

**హైదరాబాద్ రిపోర్టర్**

తన 40 సంవత్సరాల అనుభవంతో రెండు సంవత్సరాలుగా దాదాపు 250 మంది ప్రభుత్వ స్కూల్లలో చదువుతున్న విద్యార్థులను ఇంగ్లీష్ నేర్చుకోవడంలో పీహెచ్డీ విద్యార్థులతో సమానంగా తీర్చిదిద్ద గలిగానని ప్రముఖ విద్యావేత్త పినాకిని ట్రస్ట్ చైర్మన్ కర్నాటి సురేంద్రబాబు అన్నారు. దీనికి ఉదాహరణగా తన దగ్గర ఇంగ్లీష్ నేర్చుకున్న 3,4,5 తరగతుల విద్యార్థులు రెండుసార్లు ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ ప్రొఫెసర్లు,ఎం.ఏ ఇంగ్లీష్ విద్యార్థులతో నేరుగా చర్చించి రికార్డ్ సృష్టించారన్నారు. ఈ మేరకు సోమాజిగూడ,ప్రెస్ క్లబ్ లో ఆయన ప్రొఫెసర్,కార్పొరేట్ ట్రైనర్ డా.వెంకటేశ్వర్లు తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.ప్రస్తుత ప్రపంచంలో గ్లోబలైజేషన్లో భాగంగా విద్యార్థులకు ఇంగ్లీష్ భాష అతి ముఖ్యమైనదిగా మారింది అని అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో ఇతర బోధనా అంశాలు ఎలా ఉన్నా విద్యార్థులు ఇంగ్లీష్కు దూరమై కార్పొరేటర్ స్కూల్ ల విద్యార్థులతో పోటీ పడలేక చతికిలబడుతున్నారన్నారు. అందుకే తాను అత్యంత సులువైన పద్ధతిలో ఇంగ్లీషను నేర్పించే విధానాలను ప్రభుత్వ దృష్టిలో ఉంచడానికి సిద్ధంగా ఉన్నానని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తమ రాష్ట్రాల విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని సరైన విధాన పరమైన నిర్ణయాలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విద్యార్థులు ఇంగ్లీషులో తమ నైపుణ్యతను ప్రదర్శించారు.

# నారాయణపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా వెంకటేష్ గౌడ్ నియామకం

**అశ్వి అప్డేట్: నారాయణపేట జూన్ 14**



నారాయణపేట కాంగ్రెస్ పార్టీ జిల్లా లో వివిధ మండలాల అధ్యక్షులతో పాటు నారాయణపేట పట్టణం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నియమించింది నారాయణపేట పట్టణానికి చెందిన వెంకటేష్ గౌడ్ ను కాంగ్రెస్ పార్టీపట్టణ అధ్యక్షుడిగా నియమించింది, దీంతో చాలామంది యువత కాంగ్రెస్ పార్టీలో యువతకు అవకాశం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు అలాగే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నియమించినందుకు, పార్టీకి పెద్దలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, పిసిసి మహేష్ అధ్యక్షుడు కుమార్,ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి కు,ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు,తనపై నమ్మకం ఉంచి పదవిని ఇచ్చినందుకు బాధ్యతగా నిర్వర్తించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు



# ఉప సర్పంచ్ల ఫోరం గజ్వేల్ మండలం అధ్యక్షుడిగా బయ్యారం మైపాల్ రెడ్డి

**గజ్వేల్ జున్ 14, (ఆశ్వి అప్డేట్స్)**

ఉప సర్పంచుల ఫోరం గజ్వేల్ మండలం ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా బయ్యారం మైపాల్ రెడ్డి ఉప అధ్యక్షుడుగా అహ్మదిపూర్ ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి ఉపాధ్యక్షులు రమేష్ కార్యదర్శి గడ్డం ఆంజనేయులు సహ కార్యదర్శి వెంకటేశం సలహాదారులు బాలయ్య నర్సింలు కరుణాకర్ రుక్మోద్దీన్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు గజ్వేల్ మండలంలో ప్రవేట్ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఉపసర్పంచులు ప్రత్యేక సమావేశమై ఆదివారం కమిటీని ఎన్నుకున్నారు. అనంతరం బెజగమా మైపాల్ రెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ఉప సర్పంచ్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్రవ్యాప్తంగా ఉప సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, గ్రామాభివృద్ధిలో వారి పాత్రను మరింత బలోపేతం చేసేందుకు పనిచేస్తానని తెలిపారు. ఉప సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణతో పాటు గ్రామీణాభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతానని పేర్కొన్నారు.తన ఎన్నికకు సహకరించి ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు

# బీజేపీ, బిఆర్ఎస్ పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యే జి ఎం ఆర్ సమక్షంలో భారీ చేరికలు.

**ఆశ్వి అప్డేట్స్**

చిన్న చింతకుంట చిన్న చింత కుంట మండలం ఫర్దిపూర్ గ్రామానికి చెందిన బీజేపీ పార్టీ ముఖ్య నాయకులు, మండల ప్రధాన కార్యదర్శి కావాలి నరేష్ కుమ్మరి ఆంజనేయులు, పూజారి మల్లేష్, కావాలి నరేందర్, కావాలి శ్రీశైలం, కుర్వ పెద్ద అంజి, మంగలి శంకర్, బిఆర్ఎస్ పార్టీ నుండి మంగలి కరుణాకర్, మరికల్ మల్లప్ప, మంగలి రఘు, మంగలి జగదీష్, కుమ్మరి నరేష్, కావాలి నడిపి కుర్మప్ప, చాకలి నరేష్, మంగలి రాజు, ప్యాట గోవర్ధన్ తదితరులు పెద్ద ఎత్తున సోమవారం దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే అనంతరం వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే జిఎంఆర్ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# అన్నం పెట్టే రైతులు ఆత్మహత్య చేసుకోవద్దు

- ఎయిర్ ఫోర్స్ సైనికాధికారి గ్రూప్ కెప్టెన్ జీ.జే. రావ్
- ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను పరామర్శ

**జగదేవపూర్ , ఆశ్వి అప్డేట్స్**

వ్యవసాయమే ఆధారం చేసుకొని జీవనం సాగిస్తున్న రైతులు అధైర్య పడి ఆత్మహత్య చేసుకోవద్దనీ
ఎయిర్ ఫోర్స్ మాజీ సైనికాధికారి గ్రూప్ కెప్టెన్ జీ.జే. రావ్ సూచించారు. జగదేవ్ పూర్ మండలం నిర్మల్ నగర్, వట్టిపల్లి గ్రామాలలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను ఆయన ఆదివారం పరామర్శించారు.
ఈ సందర్భంగా మాజీ సైనిక అధికారి కెప్టెన్ జి జే రావు మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతులు ఆత్మహత్య చేసుకోవడం చాలా దురదృష్టకరమని రైతుల ఆత్మహత్యలు దేశానికి అరిష్టమని ఆత్మహత్య చేసుకున్న రైతులందరూ దేశ సంపదని, ఆత్మహత్యతో వారి కుటుంబాలు మూడు తరాలు వెనకబడిపోతాయని ఆ వెనుకబాటుతో దేశం కూడా వెనుకబడుతుందని కాబట్టి రైతులు ఎవరు భవిష్యత్తులో ఆత్మహత్య చేసుకోవద్దని రైతాంగానికి విజ్ఞప్తి చేశాడు. ఈ సందర్భంగా ప్రభుత్వం బాధ్యత కూడా ఉందని వారు పండించిన పంటలకు గిట్టుబాటు ధరతో పాటు ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.
గత మూడు దశాబ్దాలుగా దేశంలో జరుగుతున్న రైతు ఆత్మహత్యలను చూసి చలించిపోయానన్నారు. అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు నిర్మల్ నగర్ గ్రామానికి చెందిన కర్రె మల్లేశం, పట్టిపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి వెంకటేష్ కుటుంబాలకు మానసిక ధైర్యాన్ని నింపుతూ ఆ కుటుంబాలకు అండగా ఉంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైతు ఆత్మహత్యల పైన సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న సామాజిక కార్యకర్త పులి రాజు, హమ్మద్, కృష్ణ, అందే ప్రవీణ్, తదితరులున్నారు.





# వారాహి మాతను దర్శించుకున్న జిల్లా కలెక్టర్ కె హైమావతి

**ఆశ్వి అప్టేట్స్ కొండపాక:**

కుకునూర్ పల్లి మండల కేంద్రంలో కొలువై ఉన్న శ్రీ వారాహి దేవి, శ్రీ ప్రత్యంగిరా దేవి సమేత శ్రీ శరభేశ్వర స్వామి వారిని ఆదివారం జిల్లా కలెక్టర్ కె హైమావతి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న కలెక్టర్‌కు ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు.ఈ సందర్భంగా కలెక్టర్ హైమవతి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పండితులు కలెక్టర్‌కు వేదాశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వారాహిమాత దేవాలయ ట్రస్ట్ సభ్యులు కలెక్టర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించి, జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో వారహి మత ట్రస్ట్ చైర్మన్ మమతమ్మ , డైరెక్టర్ రామప్ప, ట్రస్ట్ సభ్యులు రెడ్డమైన రవీందర్, కాపర్తి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు



# బిల్ కలెక్టర్లు, కరోబార్ల సమస్యలు పరిష్కరిస్తాం: మంత్రి సీతక్క

**ఆశ్వి అప్టేట్స్ కొండపాక:**

గ్రామ పంచాయతీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) తెలిపారు. ఆదివారం ప్రగతి భవన్‌లో తెలంగాణ గ్రామపంచాయతీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. బిల్ కలెక్టర్లు, కరోబార్ల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ఉద్యోగుల జీతాలను పెంచి, ప్రతి నెలా నేరుగా వారి శాలరీ అకౌంట్లలోనే జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడాల నర్సింహులు, పిల్లి రవి యాదవ్, మ్యకల శ్రీధర్ , నాగరాజు తదితరులు పాల్గొన్నారు.




# నారాయణపేట జిల్లా కేంద్రంలో Namo Gen z conclave కార్యక్రమానికి సంబంధించిన సన్నాహక సమావేశం

**ఆశ్వి అప్డేట్: నారాయణపేట జూన్ 14**

ఆదివారం నారాయణపేట జిల్లాకేంద్రంలో namo Gen z conclaveనిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా BJYM రాష్ట్ర ఉపాధ్యక్షుడు నితిన్ నందకర్ గారు హాజరయ్యారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన మంత్రిగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నరేంద్ర మోడీ గారి సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, ముఖ్యంగా యువతకు దేశం పట్ల, మన పరిపాలన పట్ల అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు M భరత్ కుమార్ గారు, పట్టణ అధ్యక్షుడు జాజాపూర్ మణిశంకర్, రాష్ట్ర నాయకులు ప్రవీణ్, చంద్రశేఖర్ రెడ్డి, మోహన్, కార్తికేయ,ప్రకాష్, డి.మణి, మనీ మోడీ,p.శివ, అంజి, రాజేశ్,ఆశిష్, నవీన్ మరియు ముఖ్యమైన కార్యకర్తలు పాల్గొనడం జరిగింది

# నారాయణపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాకోట్ల రవీందర్ రెడ్డి నియమకం

**ఆశ్వి అప్డేట్: నారాయణపేట జూన్ 14**



నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లాలోని నాలుగు మండలాలకు సంబంధించి పార్టీ అధ్యక్షులను నియమించడం జరిగింది, నారాయణపేట మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా జాజాపూర్ గ్రామానికి చెందిన కోట్ల రవీందర్ రెడ్డిని నియమించడం జరిగింది, ఇది నా గతంలో కాంగ్రెస్ యువజన జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతూ కాంగ్రెస్ పార్టీ విధేయుడుగా నమ్మిన బంటుగా కొనసాగుతున్నారు, తను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నిర్మించినందుకు ఎమ్మెల్యే చిట్టెంపర్ణిక రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ కుమార్ రెడ్డి, పార్టీ పెద్దలకు కృతజ్ఞత తెలియజేస్తూ, మండలంలోని నిరంతరం పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు

## విద్యార్థుల సురక్షిత ప్రయాణానికి టీజీఎస్ ఆర్టీసీ సిద్ధం... రేపటి నుంచే ప్రత్యేక స్కూల్ బస్సులు..

**ఆశ్వి అప్డేట్స్ హైదరాబాద్ జూన్ 14:** వేసవి సెలవుల అనంతరం రేపటి (జూన్ 15 సోమవారం) నుండి రాష్ట్రవ్యాప్తంగా 2026 27 విద్యాసంవత్సరానికి గాను పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి... ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు కలగకుండా అన్ని రూట్లలో తగినన్ని స్కూల్ బస్సులను నడపాలని టీజీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డి అన్ని రీజియన్లలధికారులను ఆదేశించారు. నూతన విద్యాసంవత్సరంలో మొత్తం 227 పనిదినాలు ఉన్నందున, విద్యార్థులు సకాలంలో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకునేలా రవాణా సౌకర్యాలను సిద్ధం చేశామని ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రంలోని అన్ని రీజియన్ల అధికారులు, డిపో మేనేజర్లు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉండి రవాణా ఏర్పాట్లను పర్యవేక్షించాలని ఎండీ సూచించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థుల స్కూల్ టైమింగ్స్‌కు అనుగుణంగా బస్సు సర్వీసులను క్రమబద్ధీకరించాలని, గతంలో నడిపిన అన్ని స్కూల్ రూట్లను విధిగా పునరుద్ధరించాలని స్పష్టం చేశారు. విద్యార్థులు బస్సుల కోసం ఎక్కువ సమయం వేచి ఉండకుండా, ఉదయం మరియు సాయంత్రం వేళల్లో ఖచ్చితమైన సమయ పాలన పాటించాలని, అవసరమైన చోట అదనపు ట్రిప్పులు నడపాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఎండీ నాగిరెడ్డి ఆదేశించారు.




## తెలంగాణ : 18, 19, 20 తేదీల్లో భారీవర్షాలు

తెలంగాణలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రానున్న 3, 4 రోజుల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

ప్రస్తుతం రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు నెమ్మదిగా కదులుతున్నాయని, వచ్చే నాలుగైదు రోజుల్లో రాష్ట్రమంతటా విస్తరించే అవకాశం ఉన్నట్లు వివరించింది. ఇవాళ, రేపు, ఎల్లుండి కొన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది...

## క్రికెట్ ఆడడానికే వచ్చాం, షేక్ హ్యాండ్ ఇవ్వడానికి కాదు: హర్మన్‌ప్రీత్ కౌర్...

ఇంగ్లండ్ వేదికగా జరుగుతున్న మహిళల టీ20 ప్రపంచకప్‌లో భారత్, పాకిస్తాన్ మధ్య జరగనున్న మ్యాచ్‌పై ఉత్కంఠ నెలకొంది. మ్యాచ్‌కు ముందు జరిగిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ, తాము ఇక్కడికి క్రికెట్ ఆడడానికే వచ్చామని, ఎవరితో చేతులు కలపడానికి కాదని ఘాటుగా వ్యాఖ్యానించారు.
పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్‌పాక్




సంబంధాలు క్షీణించడంతో, భారత ప్రభుత్వం పాక్ ఆటగాళ్లతో కరచాలనం చేయకూడదని నిర్ణయించింది..



## ప్రజాసేవలో వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు

**ఆశ్వి అప్డేట్స్ జూన్ 14:** మల్కాజ్గిరి కమిషనరేట్ పరిధి వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్, ఎస్ఐ సిబ్బందితో కలిసి భాగ్యలత జాతీయ రహదారి పక్కనే ఉన్న మ్యాన్ హోల్ ని పరిశీలించారు.కురుస్తున్న వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మరియు లా అండ్ ఆర్డర్ పోలీసు అధికారులు, సిబ్బంది రోడ్లపై ప్రత్యేకంగా విధులు నిర్వర్తిస్తున్నారు.
ప్రధాన కూడళ్లు, ట్రాఫిక్ రద్దీ ప్రాంతాలు, నీరు నిలిచే ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకలను నియంత్రిస్తూ ట్రాఫిక్ సజావుగా సాగేలా చర్యలు చేపడుతున్నారు. అదే విధంగా లా అండ్ ఆర్డర్ సిబ్బంది ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందిస్తూ, వర్షం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి అండగా నిలుస్తున్నారు.
వర్షపు నీటితో నిండిన ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తూ, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా సూచనలు చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అందించేందుకు అన్ని పోలీసు యంత్రాంగాలు అప్రమత్తంగా పనిచేస్తున్నాయి.
ప్రజలు కూడా అవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాహనదారులు జాగ్రత్తగా ప్రయాణించాలని, ట్రాఫిక్ పోలీసుల సూచనలను పాటించాలని సైబరాబాద్ పోలీసులు విజ్ఞప్తి చేశారు....



# కుప్పకూలిన భారత వైమానికదళ విమానం

- ఐదురుగు వైమానికి సిబ్బంది మృతిచెందినట్లు సమాచారం



**గౌహతి, జూన్ 13:** అస్సాంలోని జోర్హాట్ వైమానిక స్థావరంలో విమాన ప్రమాదం చోటుచేసుకుంది. భారత వైమానిక దళానికి చెందిన ఏఎన్-32 రవాణా విమానం ఎయిర్‌బేస్ లోపల ల్యాండ్ అవుతుండగా, మంటలు చెలరేగడంతో కూలిపోయింది. ఈ ఘటనలో వాయుసేనకు చెందిన ఐదుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఐఏఎఫ్ అధికారులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన కో-పైలట్‌కు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు అత్యున్నత స్థాయి దర్యాప్తునకు ఆదేశించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఏఎన్-32 జెట్ దృఢమైన, రెండు ఇంజన్లు గల టర్బోప్రాప్ సైనిక రవాణా విమానం. తీవ్రమైన వాతావరణ పరిస్థితులను తట్టుకునేలా దీనిని రూపొందించారు. ఇది ఎత్తైన ప్రదేశాలలోని ఎయిర్‌ఫీల్డ్‌లలో, వేడి ఉష్ణమండల వాతావరణాల్లోనూ సమర్థంగా పనిచేస్తుంది. 7.5 టన్నుల సరకును, 50 మంది ప్రయాణికులను, 42 మంది పారాట్రూపర్లను రవాణా చేయగలదు. ప్రకృతి విపత్తుల సమయంలో మారుమూల ప్రాంతాలలో సామగ్రిని జారవిడవడానికి ఈ విమానాన్ని విస్తృతంగా ఉపయోగిస్తారు.

## మ్యాగీ నూడుల్స్‌లో పురుగులు

**సోషల్ మీడియా వార్తలను ఖండించిన నెస్లే**




**న్యూఢిల్లీ, జూన్ 13:** మ్యాగీ నూడుల్స్‌లో పురుగులు ఉన్నాయంటూ సోషల్ మీడియాలో వెల్లువెత్తుతున్న విమర్శలపై నెస్లే ఇండియా సంస్థ స్పందించింది. అవన్నీ నిరాధార ఆరోపణలని స్పష్టం చేసింది. మ్యాగీ ప్యాకెట్‌లో పురుగులు కనిపించాయని ఓ నెటిజన్ చేసిన పోస్ట్ వైరల్ కావడంతో ఈ అంశంపై చర్చ మొదలైంది. భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ ఈ ఫిర్యాదుపై దృష్టి సారించి, సంస్థ నుంచి వివరణ కోరింది. తమ ఉత్పత్తులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నాయని స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన ఫైలింగ్‌లో నెస్లే స్పష్టం చేసింది. మ్యాగీ నూడుల్స్‌పై ఆరోపణలు ఒక ధ్రువీకరించని సోషల్ మీడియా ఖాతా నుంచి వచ్చాయని నెస్లే ఇండియా స్పష్టం చేసింది. ఫిర్యాదు చేసిన వ్యక్తిని సంప్రదించి నమూనా పంపించాలని పలుమార్లు కోరినా ఎలాంటి స్పందనా రాలేదని తెలిపింది. దీంతో అసలు ఉత్పత్తి నమూనాను పరిశీలించే అవకాశం లభించలేదని పేర్కొంది. ఆరోపణలు వచ్చిన బ్యాచ్‌కు సంబంధించిన రిఫరెన్స్ నమూనాలను నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కాలిబ్రేషన్ లాబొరేటరీస్‌కు పంపించినట్టు నెస్లే వెల్లడించింది. ఆ పరీక్షల్లో ఎలాంటి పురుగులు లేదా ఇతర కలుషిత పదార్థాల ఆనవాళ్లు కనిపించలేదని, ఉత్పత్తి నాణ్యతా ప్రమాణాలకు పూర్తి అనుగుణంగా ఉందని రిపోర్ట్ వచ్చినట్టు కంపెనీ పేర్కొంది. వినియోగదారుల భద్రత, ఆహార నాణ్యత



## ఫ్రాన్స్‌లో జి-7 దేశాల సదస్సు

**విదేశీ పర్యటనకు బయల్దేరిన ప్రధాని మోడీ**

**న్యూఢిల్లీ, జూన్ 13:** భారత ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనకు బయల్దేరారు. ఫ్రాన్స్, స్లోవేకియాలలో మోదీ పర్యటిస్తారు. ఈ సందర్భంగా ఆయా దేశాలతో ద్వైపాక్షిక, వాణిజ్య, వ్యాపార సంబంధాలపై చర్చలు జరపడంతోపాటు ఫ్రాన్స్‌లో జరిగే జీ7 దేశాల సదస్సులో కడా పాల్గొంటారు. ఈ సదస్సులో వివిధ దేశాధినేతలతో సమావేశమవుతారు. ఇందుకోసం న్యూఢిల్లీ ఎయిర్‌పోర్ట్ నుంచి శనివారం ప్రధాని ప్రత్యేక విమానంలో బయల్దేరి వెళ్లారు. 1993 తర్వాత భారత ప్రధాని స్లోవేకియాలో పర్యటించనుండటం ఇదే మొదటిసారి. 14, 15 తేదీల్లో మోదీ స్లోవేకియాలో పర్యటిస్తారు. అక్కడి అధ్యక్షుడు పీటర్ పల్లెగ్రినితోపాటు ప్రధాని రాబర్ట్ ఫికోతో సమావేశమవుతారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించి, పలు ఒప్పందాలు కుదుర్చుకుంటారు. అనంతరం ఫ్రాన్స్ చేరుకుంటారు. 16, 17 తేదీల్లో ఫ్రాన్స్‌లోని ఈవియన్‌లో ఉంటారు. అక్కడ జరిగే జీ7 దేశాల సదస్సుకు హాజరవుతారు. ఈ సదస్సుకు విదేశీ నేతలు, ప్రతినిధులు హాజరవుతారు. వారితో దక్షిణాది ప్రపంచం గురించి చర్చిస్తామని మోదీ తెలిపారు. అనంతరం 18వ తేదీన ఫ్రాన్స్‌లోని ప్యారిస్‌లో జరిగే వివాటెక్ 2026 సదస్సులో పాల్గొంటారు.

# తృణమూల్ పార్టీలో కొనసాగుతున్న సంక్షోభం

**సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్ షాక్.. ▪ టీఎంసీ తిరుగుబాటు ఎంపీల గ్రూపులో చేరిక**

**న్యూఢిల్లీ, జూన్ 13:** తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీలో తలెత్తిన సంక్షోభం కొనసాగుతోంది. మరోవైపు అంతర్గత వ్యవహారాలు క్షణక్షణానికి మారుతూ ఉత్కంఠ రేపుతున్నాయి. పార్టీ అధ్యక్షురాలు మమతా బెనర్జీకి తాజాగా ఆ పార్టీ సీనియర్ ఎంపీ సుదీప్ బందోపాధ్యాయ్ షాక్ ఇచ్చారు. టీఎంసీ తిరుగుబాటు ఎంపీల గ్రూపులో శనివారంనాడు చేరారు. అనంతరం మరో అసమ్మతి ఎంపీ శతాబ్ది రాయ్‌తో కలిసి కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ను ఆయన నివాసంలో కలిశారు. 19 మంది ఎంపీలతో కలిసి తమను ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని కోరేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను సోమవారంనాడు కలుసుకోనున్నట్టు రెబల్స్ గ్రూప్ ప్రకటించిన నేపథ్యంలో సుదీప్ బందోపాధ్యాయ్ ఆ గ్రూపులో కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. జూన్ 8 నుంచి టీఎంసీ అసమ్మతి ఎంపీల సంతకాల సేకరణ చేపట్టామని, 19 ఎంపీలు సంతకాలు చేశారని రెబల్ ఎంపీ చంద్ర బర్మ బసునియా వెల్లడించారు. ఇప్పటికే ఒకసారి స్పీకర్‌ను కలిసిన తాము ఈనెల 15న మరోసారి కలిసి తమ గ్రూపునే నిజమైన టీఎంసీగా గుర్తించాలని కోరనున్నట్టు చెప్పారు. ఓంబిర్లాను కలవడానికి ముందు టీఎంసీ రెబల్స్ న్యూఢిల్లీలో సమావేశం అవుతారని, అందులో పాల్గొనేందుకు 20 మంది ఎంపీలు న్యూఢిల్లీ చేరుకుంటారని అసమ్మతి వర్గ నేత ఒకరు చెప్పారు. కాగా, తిరుగుబాటు వర్గం వాదనను టీఎంసీ తోసిపుచ్చింది. వారి వాదనకు ఎలాంటి చట్టబద్ధత లేదని పార్టీ ఎంపీ మహువా మొయిత్ర తెలిపారు. పార్టీలో చీలిక ప్రొవిజన్‌ను రాజ్యాంగంలోని 91వ సవరణ తొలగించినట్టు చెప్పారు. 19 మంది 'ద్రోహులు' పార్టీకి రాజీనామా చేసి, బీజేపీ టిక్కెట్‌పై పోటీ చేయాలని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మహువా మొయిత్ర పేర్కొన్నారు. 'ఆపరేషన్ లోటస్' పేరుతో ఫిరాయింపులకు బీజేపీ వ్యూహరచన చేసిందని, పార్టీని చీల్చాలనే ప్రయత్నం ఏమాత్రం సఫలం కాదని టీఎంసీ మరో ఎంపీ కీర్తి ఆజాద్ అన్నారు. ఇదిలావుంటే టీఎంసీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఎవరికీ గౌరవం ఇవ్వడం లేదని, ఆయన కావాలో, తాను కావాలో తేల్చుకోండంటూ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీకి అల్టిమేటం ఇచ్చిన ఆ పార్టీ ఎంపీ కల్యాణ్ బెనర్జీ శనివారంనాడు యూటర్న్ తీసుకున్నారు. 'అభిషేక్ నా కొడుకుతో సమానం. పిల్లలు ఏదైనా తప్పు చేస్తే క్షమించే గుణం తండ్రికి ఉంటుంది' అని అన్నారు. సంతకాల ఫోర్జరీ కోసులో అభిషేక్ తరపున కల్యాణ్ బెనర్జీ వాదిస్తున్నారు. ఈ కేసులో అరెస్టు నుంచి అభిషేక్ బెనర్జీకి హైకోర్టు తాత్కాలిక రక్షణ ఇచ్చింది. అయితే ఈ కేసులో కల్యాణ్ బెనర్జీ స్థానంలో మరొక లాయర్ వచ్చి చేరడం ఆయన ఆగ్రహానికి కారణమైంది. అభిషేక్ అహంకారిగా మారిపోయాడని, ఎవరినీ గౌరవించడం లేదని, అభిషేక్ లేకుండా పార్టీ నడవదని మమతా బెనర్జీ భావిస్తే తాను పార్టీ నుంచి తప్పుకుంటానని ఆయన హెచ్చరించారు. దీనిపై అభిషేక్ ఆచితూచి స్పందించారు. కల్యాణ్ బెనర్జీ తనకంటే పెద్దవారని, ఆయన తన అభిప్రాయాలను చెప్పడంలో తప్పులేదని, చిన్నప్పటి నుంచి తనను ఆయన చూశారని, ఆయన గురించి తాను ఏమీ మాట్లాడలేనని అన్నారు. ఈ క్రమంలో అభిషేక్ తన కుమారుడి లాంటివాడని కల్యాణ్ బెనర్జీ ప్రకటించడంతో టీఎంసీ అధినాయకత్వం ఊపరి పీల్చుకుంది. కాగా, కాంగ్రెస్‌లో టీఎంసీ విలీనం కానుందంటూ కొందరు చేస్తున్న ఊహాగానాలను కల్యాణ్ బెనర్జీ శనివారంనాడు తోసిపుచ్చారు. కాంగ్రెస్‌లో టీఎంసీ కలవబోవడం లేదని చెప్పారు. రెబల్ ఎంపీలు లోక్‌సభ స్పీకర్‌ను కలుస్తారంటూ వస్తున్న వార్తలపై సూచిగా స్పందించారు. 'వాళ్లు ఏమి చేయాలనుకుంటే అది చేయవచ్చు. బీజేపీ గొడుకు కింద పనిచేయాలను కుంటున్నారు. ఇదంతా ఓ కుట్ర. నియోజకవర్గాల అభివృద్ధి కోసమే బీజేపీతో పనిచేయాలనుకుంటున్నట్టు చెబుతున్నారు. తమ నియోజకవర్గాలకు ఒక్కసారి కూడా వెళ్లని వాళ్లు ప్రజలకు చేసేదేముంటుంది? బెంగాల్‌లో ప్రజాస్వామ్యం పీకనొక్కేసారు. గత నెలరోజుల్లో ఎలాంటి అభివృద్ధి చేశారు? మమ్మల్ని బీజేపీ వేధిస్తోంది, పోలీసులు వేధిస్తున్నారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఏ విపక్షానికి రాలేదు. 19 మంది ఎంపీలు వెళ్లిపోవాలనుకున్నా వాళ్లను బీజేపీ చేర్చుకోదఅని కల్యాణ్ బెనర్జీ అన్నారు.

## తదుపరి ఆర్మీచీఫ్‌గా జనరల్ ధీరజ్ సేథ్

**కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ**

**న్యూఢిల్లీ, జూన్ 13:** ప్రస్తుతం వైస్ చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గాబాధ్యతలు నిర్వహిస్తున్న లెఫ్టినెంట్ జనరల్ ధీరజ్ సేథ్ ను తదుపరి చీఫ్ ఆఫ్ ఆర్మీ స్టాఫ్‌గా నియమిస్తూ భారత ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది ఈ ఏడాది జూన్ 30న పదవీ విరమణ చేయ-ంబోతున్నారు. ధీరజ్ సేథ్ జూన్ 30 మధ్యాహ్నం నుంచి ఆర్మీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తారు. ఆయన పదవీకాలం 2028 ఆగస్టు 31 వరకు కొనసాగనుంది. నేషనల్ డిఫెన్స్ అకాడమీ, ఖడక్వాస్లా పూర్వ విద్యార్థి అయిన ధీరజ్ సేథ్ 1986లో భారత సైన్యంలో చేరారు. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు సైన్యంలో వివిధ హోదాల్లో పని చేశారు. ధీరజ్ సేథ్ దక్షిణ కమాండ్, దక్షిణ పశ్చిమ కమాండ్‌లకు సారథ్యం వహించడంతో పాటు, ఆర్మీ ప్రధాన కార్యాలయం లోనూ కీలక పదవులు చేపట్టారు. సైన్యంలో విశిష్ట సేవలకు గుర్తింపుగా ఆయనకు పరమ్ విశిష్ట సేవా మెడల్ , ఉత్తమ్ యుద్ధ సేవా మెడల్, అతి విశిష్ట సేవా మెడల్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలు లభించాయి.





# 4 గంటలు కదలకుంటే..
# 40 రోగాలు

నేటి ఆధునిక జీవనశైలిలో.. ఆఫీసులోనైనా, ఇంట్లోనైనా ప్రతి రెండు గంటలకు ఒకసారి పది నిమిషాలు నడుస్తూ ఉండాలి. అలా కాకుండా గంటలు తరబడి కూర్చుంటే మీకు తీవ్రమైన వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. ప్రతి ఉద్యోగంలో పనిగంటలు పెరిగిపోతున్నాయి. ఇంట్లో చేసినా, ఆఫీసులో చేసినా గంటల కొద్దీ కదలకుండా కూర్చొని పనిచేసే వారి సంఖ్య పెరిగిపోయింది. ఎక్కువసేపు కూర్చొని పని చేయడం వల్ల ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తూనే ఉన్నారు. సుదీర్ఘ పని గంటలు అనేవి ఉత్పాదకతను పెంచుతున్నప్పటికీ మనిషి ఆరోగ్యాన్ని మాత్రం దెబ్బతీస్తున్నాయి. వారి వృత్తిగత, వ్యక్తిగత జీవితం మధ్య సమతుల్యతను నిర్వీర్యం చేస్తున్నాయి. చాలా మంది ఉద్యోగాలు, పనుల కారణంగా గంటల తరబడి ఒకే చోట కూర్చోవాల్సి వస్తుంది. కంప్యూటర్ ముందు పనిచేయడం, ఎక్కువ దూరం ప్రయాణించడం, టీవీ చూడటం వంటివి మన దైనందిన జీవితంలో భాగమైపోయాయి. అయితే.. నాలుగు గంటల కంటే ఎక్కువ సేపు ఒకే చోట కూర్చోవడం వల్ల కేవలం బద్ధకం మాత్రమే కాదు.. ఇది మానసిక పనితీరుపై ప్రభావం చూపిస్తుంది. ఎక్కువ గంటలు పనిచేయడం వల్ల గుండె జబ్బులు, పక్షవాతం, మధుమోహం వచ్చే ప్రమాదం కూడా పెరిగిపోతుంది.


### గుండె జబ్బులు, మధుమేహం:
కదలకుండా 4 గంటల పాటు ఒకే చోట కూర్చోవడం వల్ల గుండె జబ్బులు, టైప్ 2 మధుమేహం వచ్చే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది. ఎక్కువసేపు కూర్చోవడం వల్ల శరీరంలో కొవ్వులు, చక్కెర జీవక్రియ దెబ్బతింటుంది. ఇది చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచి.. మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిలు పెరిగి ఇన్సులిన్ నిరోధకత అభివృద్ధి చెందుతుంది. అంతే కాకుండా ఇది మధుమేహానికి దారితీస్తుంది. ఫలితంగా గుండె కండరాలు బలహీనపడతాయి. రక్త నాళాలు గట్టిపడి, రక్త ప్రసరణ కూడా మందగిస్తుంది. ఇది గుండెపోటు, స్ట్రోక్ వంటి వాటికి దారితీయవచ్చు. అంతేకాక అధిక రక్తపోటు, పక్షవాతం వంటి సమస్యలు వస్తాయి. ఎక్కువసేపు కూర్చోవడం వల్ల ఒత్తిడి పెరిగిపోతుంది.

### కీళ్ల సమస్యలు


ఒకే చోట కదలకుండా ఎక్కువసేపు కూర్చొని పనిచేయడం వల్ల కండరాల్లో, కీళ్లల్లో సమస్యలు వస్తాయి. వెన్నునొప్పి, మెడ నొప్పి వంటి సమస్యలు కూడా కనిపించే అవకాశం ఉంది. శారీరక శ్రమ లేకపోవడం వల్ల శరీరంలో కేలరీలు సరిగ్గా బర్న్ కావు. నిరంతరం కూర్చోవడం వల్ల మెటబాలిక్ రేటు మందగిస్తుంది. అంతే కాకుండా ఇది కొవ్వు పేరుకుపోవడానికి కూడా దారితీస్తుంది. ముఖ్యంగా పొత్తికడుపు చుట్టూ కొవ్వు పేరుకుపోయి స్థూలకాయానికి దారితీస్తుంది. స్థూలకాయం అనేది గుండె జబ్బులు, మధుమేహం, అధిక రక్తపోటు వంటి అనేక దీర్ఘకాలిక వ్యాధులకు మూలం.

### జీర్ణ సమస్యలు :
కదలకుండా కూర్చుని పని చేస్తే ఇది ఇరిటబుల్ సిండ్రోమ్, అల్సర్లు, యాసిడ్ రిఫ్లెక్స్ వంటి జీర్ణ సమస్యలు వస్తాయి. ఒత్తిడి కారణంగా సరైన ఆహారం తీసుకోలేరు. శారీరక శ్రమ కూడా ఉండదు. కాబట్టి జీర్ణ సమస్యలు అధికంగా మారిపోతాయి. ఎక్కువసేపు ఒకే చోట కూర్చోవడం వల్ల వెన్నెముకపై విపరీతమైన ఒత్తిడి పడుతుంది. ముఖ్యంగా తప్పుడు భంగిమలో కూర్చుంటే, నడుము నొప్పి, మెడ నొప్పి, భుజం నొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. డిస్క్ ప్రొలాప్స్ (నడుము డిస్క్ జారడం) వంటి తీవ్రమైన సమస్యలకు కూడా వస్తుంటాయి. అంతే కాకుండా కండరాలు బిగుసుకుపోయి, బలహీనపడతాయి.

### క్యాన్సర్లు వచ్చే ప్రమాదం :
కొన్ని అధ్యయనాలు నిరంతరం కూర్చోవడం వల్ల పెద్దప్రేగు క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, ఎండోమెట్రియల్ క్యాన్సర్ వంటి కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదం పెరుగుతుందని సూచిస్తున్నాయి. అంతే కాకుండా ఇది శారీరక నిష్క్రియాత్మకత హార్మోన్ల స్థాయిలను ప్రభావితం చేస్తుంది. ఫలితంగా కణాల పెరుగుదలను ప్రభావితం చేసే ప్రోటీన్లను నియంత్రిస్తుంది. ఎక్కువ పని గంటలు మీ మానసిక స్థితిపై చెడు ప్రభావాన్ని చూపిస్తాయి. ఇది సాధారణ జీవితాన్ని అతలాకుతలం చేస్తాయి.




### డయాబెటిస్ :
ఎవరైతే ఎక్కువసేపు కూర్చొని పనిచేస్తారో వారిలో టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సుదీర్ఘ పని గంటలు అనేవి మధుమేహ రోగం ప్రమాదాన్ని పెంచుతుంది. ఎక్కువ సేపు కూర్చోవడం ఆహారాన్ని సరిగా తినకపోవడం, శారీరక శ్రమ లేకపోవడం అనేవి మధుమేహం రాకను వేగవంతం చేస్తుంది.ఎక్కువసేపు కాళ్ళు కదపకుండా కూర్చోవడం వల్ల కాళ్ళలో రక్తం గడ్డకట్టే ప్రమాదం పెరుగుతుంది. దీనినే డీప్ వీన్ థ్రాంబోసిస్ అంటారు. ఈ రక్తం గడ్డకట్టడం విడిపోయి ఊపిరితిత్తులకు చేరుకుంటే పల్మనరీ ఎంబోలిజం అనే ప్రాణాంతక పరిస్థితికి దారితీయవచ్చు.

### డిప్రెషన్ :


శారీరక శ్రమ లేకపోవడం వల్ల మానసిక ఆరోగ్యం కూడా ప్రభావితమవుతుంది. నిరంతరం కూర్చోవడం వల్ల ఆందోళన, డిప్రెషన్ వంటి మానసిక ఆరోగ్య సమస్యలు పెరిగే అవకాశం ఉందని కొన్ని అధ్యయనాలు సూచిస్తున్నాయి. శారీరక శ్రమ ఎండార్ఫిన్‌లను విడుదల చేస్తుంది. ఇవి మానసిక స్థితిని మెరుగుపరుస్తాయి. అంతేకాక ఎక్కువ గంటలు పని చేయడం అనేది సంతా నసమస్యలకు కారణం అవుతుంది. లేదా మహిళల్లో గర్భస్రావం కావడం లేదా పుట్టబోయే బిడ్డలో లోపాలు రావడం వంటివి కనిపిస్తాయి. ఎక్కువ పని గంటలు మీకు తెలియకుండానే ఒత్తిడిని కారణమవుతాయి. ఇవి హార్మోన్లు అసమతుల్యతకు దారితీస్తుంది. దీనివల్ల మగవారిలో సంతానోత్పత్తి సమస్యలు మహిళల్లో గర్భధారణకు సంబంధించిన సమస్యలు అధికంగా కనిపిస్తాయి.

### వృద్ధాప్య సమస్య :
ఎక్కువ గంటలు పనిచేయడం వల్ల మీ చర్మం త్వరగా ముసలిది అయిపోతుంది. జుట్టు నెరిసిపోతుంది. వయసు సంబంధిత వ్యాధులు వస్తాయి. ఒత్తిడి కారణంగా వృద్ధాప్య ప్రక్రియ వేగవంతం అయిపోతుంది. మీ వయసుకు తగ్గట్టు కాకుండా మీ వయసుకు మించిన వారిలా కనిపించడం మొదలవుతుంది.

### పరిష్కారం ఏమిటి ?
ఈ సమస్యలను నివారించడానికి.. మీరు ప్రతి 3060 నిమిషాలకు ఒకసారి లేచి, కొద్దిసేపు నడవండి.. స్టాండింగ్ డెస్క్‌లను ఉపయోగించడం, చిన్నపాటి వ్యాయామాలు చేయడం, మెట్లు ఎక్కడం వంటి చిన్నపాటి మార్పులు మీ ఆరోగ్యంపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతాయి. పని మధ్యలో చిన్న విరామాలు తీసుకోవడం, నడవడం, వంటివి చేసి మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చాలా అవసరం. మీ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయకుండా.. చురుకైన జీవనశైలిని అలవర్చుకోవాల్సిన అవసరం ఉంది.



# గ్లాస్ షర్బత్‌తో
# రోజుంతా హుషారు

నిమ్మరసం కేవలం వేసవి కాలంలోనే తీసుకుంటాం.. కానీ నిమ్మరసం, అల్లం, పుదీనా, కీరదోస వేసిన నీళ్లు తాగటం వల్ల నీరసం, నిస్సత్తువ ఆవరించవు. రోజంతా తాజాగా, ఉత్సాహంగా ఉంటుంది. శరీరానికి సోడియం, పొటాషియం, పీచు, చక్కెర, క్యాల్షియం, ఐరన్, ప్రొటీన్లు, విటమిన్లు అందుతాయి. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. జీర్ణప్రక్రియ సవ్యంగా పనిచేస్తుంది. శరీరంలో చేరిన మలినాలు బయటకు వెళ్లిపోతాయి. ఊబకాయం రాదు. కాలేయానికి, మూత్రపిండాలకు కూడా మంచిది. రోజుకు రెండు లీటర్ల నీళ్లు తాగమంటారు వైద్యులు. పిల్లలతో అన్ని నీళ్లు తాగించాలంటే ఇలా చేసివ్వాలి. అప్పుడిక పేచీ పెట్టకుండా ఇష్టంగా తాగేస్తారు. చాలా తక్కువ ఖర్చుతో ఈ నిమ్మకాయ షర్బత్ తయారవుతుంది. నిమ్మ రసానికి ఇనుమును స్వీకరించే గుణం ఉంది. రక్తహీనత ఉన్నవారికి గొప్ప ఔషధం ఇది. జిడ్డు తొలగిస్తుంది. చర్మానికి వర్ణాన్నిచ్చి, ప్రకాశవంతం చేస్తుంది. మానసిక ఒత్తిడిని, బీపీనీ అదుపు చేస్తుంది. సివిటమిన్ కోసం ఆధారపడదగిన ఫలం నిమ్మ. దీన్ని కాచడం గానీ, ఉడికించటం గానీ చెయ్యకూడదు. అలా చేస్తే... సివిటమిన్ ఎగిరిపోతుంది.


**చాలా ఈజీ...**

నిమ్మకాయ షర్బత్ చాలా సులువు.. ముందుగా ఏదైనా పాత్రలో కొంత చల్లటి నీరును తీసుకోవాలి. ఆ తర్వాత ఆ నీటికి తగ్గట్టుగా రెండు లేదా మూడు దోర నిమ్మకాయలు తీసుకుని వాటిని రెండు ముక్కలుగా కట్ చేయాలి. ఆ తర్వాత వాటి రసంను ఆ నీటిలో పిండాలి. ఆ తర్వాత ఆ నీటిని రెండుమూడుసార్లు కలపాలి. ఆ తరువాత అందులో సరైన విధంగా అంటే.. ఆ నీటికి తగ్గట్టుగా, అదేవిధంగా నిమ్మకాయ పులుపునకు తగ్గట్టుగా ఉండే విధంగా అందులో పంచదార వేసుకోవాలి. అలాగే స్పూన్ లేదా రెండు స్పూన్ల ఉప్పును కలపాలి. ఆ తరువాత ఓ గంటెతో బాగా కలపాలి. ఆ తరువాత ఆ నీరును రెండు పెద్ద పాత్రల్లోకి తీసుకుని...ఒకదానిలోంచి మరొకపాత్రలోకి, ఈ పాత్రలోనుంచి ఆ పాత్రలోకి ఆ నీటిని పోయాలి. ఇలా చేస్తే అదంతా బాగా మిక్స్ అవుతుంది. అలా షర్బత్ తయారవుతుంది. ఆ షర్బత్ ను తాగాలి.



# రూ.400 కోట్ల దిశగా దూసుకెళ్తున్న 'పెద్ది'





**హైదరాబాద్, జూన్ 13 :** మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ కథానాయకుడిగా, దర్శకుడు బుచ్చిబాబు సనా తెరకెక్కించిన 'పెద్ది' చిత్రం బాక్సాఫీస్ వద్ద విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. భావోద్వేగాలు, క్రీడా నేపథ్యం, గ్రామీణ జీవనశైలిని మేళవించి రూపొందించిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ పొందుతూ భారీ వసూళ్లతో ముందుకు సాగుతోంది. విడుదలైన తొలి రోజు నుంచే సానుకూల స్పందన అందుకున్న ఈ చిత్రం తాజాగా మరో కీలక మైలురాయిని చేరుకుంది. విడుదలై తొమ్మిది రోజులు పూర్తైన సందర్భంగా చిత్ర నిర్మాణ సంస్థ ప్రకటించిన వివరాల ప్రకారం, 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా రూ.366 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. ఈ వసూళ్లతో రామ్ చరణ్ సినీ ప్రయాణంలో అత్యధిక ఆదరణ పొందిన చిత్రాల్లో ఒకటిగా నిలిచిన 'పెద్ది', సోలో హీరోగా ఆయన నటించిన చిత్రాల్లో అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా రికార్డు సృష్టించింది. గ్రామీణ నేపథ్యంలో సాగే కథ, క్రీడా అంశాలు, హృదయాన్ని తాకే భావోద్వేగ సన్నివేశాలు అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రస్తుతం వారాంతపు ప్రదర్శనలకు కూడా మంచి స్పందన లభిస్తున్నట్లు సినీ వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలోని ఇతర ప్రాంతాలు, విదేశీ మార్కెట్లలోనూ చిత్రం నిలకడైన వసూళ్లు సాధిస్తోంది. దీంతో 'పెద్ది' త్వరలోనే రూ.400 కోట్ల గ్రాస్ క్లబ్‌లో చేరే అవకాశాలు బలంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుతం పెద్ద చిత్రాల పోటీ లేకపోవడం, కుటుంబ ప్రేక్షకుల మద్దతు కొనసాగుతుండటం సినిమాకు అదనపు బలంగా మారింది. ముఖ్యంగా రామ్ చరణ్ నటనకు ప్రేక్షకులతో పాటు విమర్శకుల నుంచి కూడా ప్రశంసలు లభిస్తున్నాయి. పాత్రలో ఆయన చూపించిన భావోద్వేగాలు, క్రీడాకారుడి పాత్ర కోసం చేసిన కృషి చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సనా కథను హృద్యంగా తెరకెక్కించడంలో విజయవంతమయ్యారని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 'పెద్ది' విజయయాత్ర ఇంకా కొనసాగుతుండటంతో రాబోయే రోజుల్లో మరిన్ని వసూళ్ల రికార్డులను సొంతం చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం సినీ అభిమానుల దృష్టంతా ఈ చిత్రం ఎంత వేగంగా రూ.400 కోట్ల మార్కును చేరుకుంటుందన్న అంశంపైనే కేంద్రీకృతమైంది.



# కంఫర్ట్ జోన్ దాటి నటించా..

## 'ఇకాయ్' నా కెరీర్‌లోనే పెద్ద సవాల్: సయీ మంజ్రేకర్

**ముంబై :** 'మేజర్', 'స్కంద' చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన నటి సయీ మంజ్రేకర్ ప్రస్తుతం నటిస్తున్న 'ఇకాయ్' చిత్రం తన కెరీర్‌లోనే అత్యంత సవాలుతో కూడుకున్న సినిమా అని వెల్లడించారు. రాఘవ్ జుయల్ హీరోగా నటిస్తున్న ఈ రొమాంటిక్ హారర్ చిత్రం ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన సయీ మంజ్రేకర్, ఇప్పటివరకు తాను చేసిన చిత్రాల్లో 'ఇకాయ్' తనకు అతిపెద్ద సవాలుగా నిలిచిందని తెలిపారు. ఈ సినిమా కోసం కొన్ని సందర్భాల్లో తన కంఫర్ట్ జోన్ దాటి నటించాల్సి వచ్చిందని, కొన్ని భావోద్వేగ సన్నివేశాల్లో సహజత్వాన్ని తీసుకురావడం కష్టంగా అనిపించినప్పటికీ, అలాంటి అనుభవాలే ఒక నటిగా తనను మరింత మెరుగుపరుస్తాయని చెప్పారు. ఈ చిత్రంలో ప్రేక్షకులు తన నటనలోని కొత్త కోణాన్ని చూడబోతున్నారని సయీ ఆశాభావం వ్యక్తం చేశారు. యాక్షన్, డ్రామా తరహా పాత్రలకు భిన్నంగా రొమాంటిక్ హారర్ కథలో నటించడం తన కెరీర్‌కు కొత్త అనుభవాన్ని అందించిందని పేర్కొన్నారు. రాజ్ సింగ్ చౌదరి దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ఇటీవల ముంబైలోని కొలాబా ప్రాంతంలో జరిగింది. ప్రస్తుతం నిర్మాణ దశలో ఉన్న 'ఇకాయ్' చిత్రాన్ని 2027 ప్రథమార్ధంలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు.

# తన పేరుతో మోసాలు

## అభిమానులను హెచ్చరించిన మీనాక్షి చౌదరి

**హైదరాబాద్, జూన్ 13 :** 'లక్కీ భాస్కర్' చిత్ర విజయంతో తెలుగు సినీ పరిశ్రమలో ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి మీనాక్షి చౌదరి తాజాగా తన పేరుతో జరుగుతున్న సైబర్ మోసాలపై ఆందోళన వ్యక్తం చేశారు. తనను అనుకరిస్తూ కొందరు గుర్తుతెలియని వ్యక్తులు అభిమానులను, ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని వెల్లడించారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించిన మీనాక్షి చౌదరి, తన పేరును ఉపయోగిస్తూ నకిలీగా వ్యవహరిస్తున్న వ్యక్తి ఫోన్ నంబర్‌కు సంబంధించిన చిత్రాన్ని తన అధికారిక ఖాతాలో పంచుకున్నారు. ఆ నంబర్ నుంచి వచ్చే ఫోన్ కాల్స్ లేదా సందేశాలను ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని అభిమానులకు విజ్ఞప్తి చేశారు. సదరు నంబర్ తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేసిన ఆమె, అలాంటి సందేశాలు లేదా కాల్స్ వస్తే వెంటనే ఆ నంబర్‌ను నిరోధించి, సంబంధిత వేదికలకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ మోసాన్ని గుర్తించి తన దృష్టికి తీసుకొచ్చిన అభిమానులు, సామాజిక మాధ్యమ వినియోగదారులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల ప్రముఖుల పేర్లతో నకిలీ ఖాతాలు సృష్టించి మోసాలకు పాల్పడే ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో అభిమానులు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. ఇక సినీ ప్రస్థాన విషయానికి వస్తే, మీనాక్షి చౌదరి ప్రస్తుతం వరుస చిత్రాలతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'వృషకర్మ' చిత్రంపై ప్రేక్షకుల్లో భారీ ఆసక్తి నెలకొంది. దర్శకుడు కార్తీక్ దండు తెరకెక్కిస్తున్న ఈ చిత్రం పౌరాణిక అంశాలు, ఉత్కంఠభరిత కథాంశంతో రూపొందుతోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమాపై సినీ అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు.



# దృశ్యం 3' ఓటీటీ రిలీజ్ డేట్ ఫిక్స్!

## ఈ నెల 18 నుంచే స్ట్రీమింగ్

హైదరాబాద్: మోహన్‌లాల్, దర్శకుడు జీతూ జోసెఫ్ కాంబినేషన్‌లో థియేటర్లలో మంచి విజయాన్ని అందుకున్న క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ 'దృశ్యం 3' ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేస్తోంది. ఈ చిత్ర డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియో సొంతం చేసుకుంది. తాజా సమాచారం ప్రకారం, ఈ చిత్రం జూన్ 18 నుండి అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుంది. ప్రస్తుతానికి కేవలం మలయాళ భాషలో మాత్రమే ఇది అందుబాటులోకి రానుండగా, తెలుగుతో పాటు ఇతర దక్షిణాది భాషల డబ్బింగ్ వెర్షన్ల విడుదలపై ఇంకా అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. థియేటర్లలో జార్జ్‌కుట్టిగా మోహన్‌లాల్ నటన, ఉత్కంఠభరిత మలుపులతో మెప్పించిన ఈ చిత్రం కోసం ఓటీటీ ప్రియులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# దిశా పటాని సక్సెస్ స్టోరీ

## రూ. 500లతో వచ్చి స్టార్ హీరోయిన్‌గా..!



**ముంబై:** గ్లామర్ బ్యూటీ దిశా పటాని సినీ ప్రయాణం ఎంతోమందికి స్ఫూర్తిదాయకం. ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా పరిశ్రమలోకి వచ్చిన ఆమె, నేడు బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు పొందింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన దిశా, చదువులో టాలెంటెడ్. మొదట పైలట్ లేదా శాస్త్రవేత్త కావాలనుకుని బయోటెక్నాలజీ ఇంజినీరింగ్ చేసింది. అయితే మోడలింగ్‌పై ఆసక్తితో ముంబైకి వెళ్లాలని నిర్ణయించుకుంది. ఆ సమయంలో తన వద్ద కేవలం రూ. 500 మాత్రమే ఉన్నాయని, ఎవరి సాయం లేకుండా స్వయంకృషితోనే అవకాశాలు వెతుక్కున్నానని ఆమె వెల్లడించింది. 2015లో తెలుగు సినిమా 'లోఫర్'తో కెరీర్ ప్రారంభించిన దిశా, 2016లో వచ్చిన 'ఎంఎస్ ధోని: ది అన్‌టోల్డ్ స్టోరీ'తో దేశవ్యాప్తంగా పాపులర్ అయింది. ప్రస్తుతం గ్లామర్ ఫొటోషూట్లు, వరుస సినిమాలతో సోషల్ మీడియాలోనూ భారీ ఫాలోయింగ్‌తో దూసుకుపోతోంది.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in